





# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 2-2-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 156 పేజీలు: 4 వెల: రూ.1/-


# ఊరించి ఉసూరుమనిపించిన నిర్మలా బడ్జెట్

బడ్జెట్‌లో పేలిన పెట్రో బాంబ్ ● ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు తాయిలాలు ● వైద్య రంగానికి పెరిగిన కేటాయింపులు
● బడ్జెట్ మూలధన వ్యయం రూ.5.54 లక్షల కోట్లు ● 2021-22 ద్రవ్యలోటు లక్ష్యం 6.8 శాతం
● టీమ్ ఇండియా తరహాలో భారత ఆర్థిక రంగం పుంజుకుంటుంది. ● అర్బన్ స్వచ్ఛ భారత్ మిషన్ 2.0కు లక్ష 41 వేల కోట్లు..
● కరోనా వ్యాక్సిన్ కోసం 35 వేల కోట్లు.. అవసరమైతే మరిన్ని నిధులు ● కాలం తీరిన వాహనాలను తుక్కుగా మార్చేలా పథకం..
● హెల్త్ కేర్‌కు రెండు లక్షల కోట్లు.. జల్ జీవన్ మిషన్‌కు 2.7 లక్షల కోట్లు.. ● రక్షిత మంచినీటి పథకానికి 87 వేల కోట్లు..
● వాయు కాలుష్య నివారణకు 2217 కోట్లు.. ● గతేడాది కంటే ఈ బడ్జెట్లో ఆరోగ్యానికి 137 శాతం అధికంగా నిధులు
● కేపిటల్ వ్యయానికి 5.54 లక్షల కోట్లు.. ● దేశంలోని మరో నాలుగు ప్రాంతాల్లో వైరాలజీ ల్యాబ్‌లు.
●రహదారుల విస్తరణ కోసం న్యూ ఎకనామిక్ కారిడార్లు ● మూడేళ్లలో ఏడు టెక్స్టైల్ పార్కులు.. ప్రతి జిల్లాలో సమగ్ర హెల్త్ ల్యాబ్స్..
● బెంగళూరులో మెట్రో విస్తరణకు 14700 కోట్లు ● చెన్నైలో మెట్రో విస్తరణకు 63 వేల కోట్లు
● భారత మాల కింద 13 వేల కిలోమీటర్ల జాతీయ రహదారుల అభివృద్ధి.. ● విద్యుత్ రంగానికి 3.05 లక్షల కోట్లు..
● జనాభా లెక్కల కోసం రూ.3,726 కోట్లు. ● డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం రూ. 1.75 లక్షల కోట్లు
● ఎన్‌జీఓలతో భాగస్వామ్యం ద్వారా 100 సైనిక్ స్కూల్స్ ఏర్పాటు ● లెహ్, లడఖ్‌లో యూనివర్సిటీ ఏర్పాటు
● తేయాకు తోటల కార్మికుల కోసం 1000కోట్లు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కరోనాతో అతలాకుతలమైన దేశాన్ని ఆదుకునేందుకు కరోనా ఊరడింపులతో బడ్జెట్ రాబోతుందన్న ఊహాగానాల నేపథ్యంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతరామన్ ప్రవేశ పెట్టిన 2021-22 వార్షిక బడ్జెట్ ఉసూరుమనిపించింది. ప్రజలను ఆశల పల్లకిలోకి తీసుకుని వెళ్లిన బడ్జెట్... ప్రతిపాదనలు మాత్రం ఎలాంటి ఊరడింపు లేకుండా చేశాయి. దీనికి తోడు పెట్రోల్‌పై అగ్రి సెస్ విధింపుతో పెట్రో ధరల పెంపును మరింతగా ప్రోత్సహించారు. కరోనా మహమ్మారితో దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్త మైంది. జనజీవితం తీవ్రంగా ప్రభావితమైంది. డిజిటల్ పద్ధతిలో బ్జడెట్ ప్రవేశపెట్టిన నిర్మల.. గంటా 51 నిముషాలపాటు ప్రసంగించారు. బడ్జెట్ మూలధన వ్యయం రూ.5.54 లక్షల కోట్లుగా ఆమె పేర్కొన్నారు. 2021-22 ద్రవ్యలోటు లక్ష్యం 6.8 శాతంగా ఉండనుందనే అంచనాలను వెల్లడించారు. 2025-26 నాటికి

ద్రవ్యలోటు లక్ష్యం 4.5 శాతంగా ఉంటుందని అంచనా వేశారు. 2022లో రూ.12 లక్షల కోట్ల అప్పులు తేవాలని నిర్ణయించినట్టు ఆర్థికమంత్రి చెప్పుకొచ్చారు. అయితే ఆదాయ పన్నులపై ఎలాంటి క్లారిటీ ఇవ్వకపోవడంతో 2021-22 బ్జడెట్‌పై భారీ ఆశలు పెట్టుకున్న మధ్యతరగతి ఉద్యోగులకు నిరాశే మిగిలింది. నిర్మలా సీతారామన్ ప్రసంగం అనంతరం లోక్‌సభ రేపటికి వాయిదా పడింది. కరోనా నేపథ్యంలో అనుకున్నట్లుగానే వైద్య రంగానికి కేటాయింపులు పెంచారు. ఎన్నికలు జరగనున్న బెంగాల్, తమిళనాడు,కేరళ లాంటి రాష్ట్రాలకు తాయిలాలు ప్రకటించారు. వయోవృద్ధులయిన 75 ఏళ్లకు పైబడిన వారికి ఐటి రిటర్న్ నుంచి మినహాయింపు నిచ్చారు. పన్ను చెల్లింపుదారులకు మాత్రం ఎలాంటి వెసలుబాటు కల్పించలేదు. ఈ సందర్భంగా కేంద్రం బ్జడెట్ యాప్‌ను విడుదల చేసింది. ఇక విపక్షాల నిరసనల మధ్య బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించిన నిర్మలా సీతారామన్... కరోనా లాక్‌డౌన్ దెబ్బకు కుంటుపడిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఎన్డీయే సర్కారు తీసుకున్న చర్యల గురించి వివరించారు. అనేక సంక్షోభాలను ఎదుర్కొని ఆర్థిక వ్యవస్థను బాగుచేశాం. లాక్‌డౌన్ సందర్భంగా లక్షలాది మందికి ఉచితంగా ధాన్యం పంపిణీ చేశాం. ఆత్మ నిర్భర్ భారత్ ప్యాకేజీ ప్రకటించాం. 80 మిలియన్ల జనాభాకు ఉచిత గ్యాస్ అందజేశామని పేర్కొన్నారు. అదే విధంగా... కరోనా కట్టడికి రెండు వ్యాక్సిన్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. మరో రెండు వ్యాక్సిన్లు భారత్‌తో పాటు ఇతర దేశాలకు వాక్సిన్ల డోసులు ఎగుమతి చేస్తున్నామని ప్రకటించారు. వందదేశాలకు మనం కరోనా టీకాలను సరఫరా చేస్తున్నాం. కరోనా కేసులను కట్టడి చేయడంతో దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టగలిగాం. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే అన్ని అంశాలను బ్జడెట్‌లో పొందుపరిచామని తెలిపారు. స్థూల మార్కెట్ రుణాల లక్ష్యం రూ. 12 లక్షల కోట్లుగా చెప్పారు. అలాగే 5వ ఆర్థిక సంఘం సిఫార్సులకు కేంద్రం ఆమోదం చెబుతూ.. పన్నుల్లో రాష్ట్రాలకు 41 శాతం వాటాగా ప్రకటించారు. ఇక గతంలో ఎన్నడూ లేని పరిస్థితుల్లో బ్జడెట్ ప్రవేశపెడుతున్నామన్న ఆర్థిక మంత్రి.. దేశ ఆర్థిక వ్యవస్థకు ఈ బడ్జెట్ కొత్త ఊతం ఇస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక కరోనా వ్యాప్తి నేపథ్యంలో.. గతేడాది లాక్‌డౌన్ అమలు చేయాలన్న నిర్ణయం కఠినమైనదేనన్న నిర్మలా సీతారామన్... లాక్‌డౌన్ విధించకపోతే మరింత ఘోరమైన పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. కరోనా సంక్షోభం నేపథ్యంలో.. ఆరేళ్ల కాలానికి గానూ 64,180 కోట్లతో ఆత్మనిర్భర్ హెల్త్ యోజన ప్రకటించిన ఆర్థిక మంత్రి.. దేశవ్యాప్తంగా 15 హెల్త్ ఎమర్జెన్సీ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బడ్జెట్‌లో అనేక రంగాలకు భారీమొత్తంలో కేటాయింపులు జరిపారు. జల్ జీవన్ మిషన్ కోసం రూ.2.87 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. వైద్య ఆరోగ్యం కోసం రూ.2.23 లక్షల కోట్లు కేటాయించారు. వాయు కాలుష్యం నివారణ కోసం 42సెంటర్లకు రూ.2,217 కోట్లు కేటాయించారు.

మెగా ఇన్వెస్ట్‌మెంట్ టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. మూడేళ్లలో 7పార్కుల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మెట్రో రైల్ నెట్‌వర్క్ మరింత విస్తరిస్తున్నామని తెలిపారు. మెట్రో రైల్ అభివృద్ధి కోసం పీపీపీ విధానాన్ని అవలంబిస్తున్నామని తెలిపారు. బెంగాల్‌లో రూ.25వేల కోట్లతో 675 కి.మీ. రోడ్లు నిర్మించామని తెలిపారు. కొచ్చి మెట్రో రైల్ ఫేజ్-2కు 1,957 కోట్లు, చెన్నై మెట్రో రైల్ ఫేజ్‌కు .5,300 కోట్లు, బెంగళూరు మెట్రో రైల్ ఫేజ్-2కు .14,788 కోట్లు, నాగ్‌పూర్ మెట్రో రైల్ ఫేజ్-2కు .5,976 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ప్రజా రవాణా కోసం కొత్తగా రూ.18 వేల కోట్లతో బస్సులు కొనుగోలు చేస్తున్నామని నిర్మల ప్రకటించారు. 9 షిప్ రీసైక్లింగ్ యూనిట్‌ల ద్వారా లాభాలు వస్తున్నాయని, భారీగా విదేశీ మారకం దేశంలో ప్రవేశిస్తోందని తెలిపారు. ఇకపోతే పన్నులు చెల్లించేవారిపై ఈ బ్జడెట్ నీళ్లు

చల్లింది. వారికి ఎలాంటి మినహాయింపులూ ప్రకటించలేదు. ఆదాయపన్ను శ్లాబుల్లో కేంద్రం ఎలాంటి మార్పులూ చేయలేదు. దీంతో పన్ను చెల్లింపుదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. మధ్య తరగతి ప్రజలు ఎంతైతో ఆశలు పెట్టుకున్నారో... అవన్నీ నిరాశలయ్యాయి. మరోవైపు 75 ఏళ్లు దాటిన వారికి మాత్రం కేంద్రం భారీ ఊరటనిచ్చింది. 75 ఏళ్లు దాటినవారు ఆదాయపన్ను రిటర్న్ దాఖలు చేయాల్సిన అవసరం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అలాగే చిన్న పన్ను చెల్లింపుదారులకు వివాద పరిష్కార కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బ్జడెట్‌లో కరోనా వ్యాక్సిన్ అభివృద్ధి, తయారీకి రూ.35 వేల కోట్లు ప్రకటించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్లు కూడా ఆమె స్పష్టం చేశారు. ఇప్పటికే రెండు వ్యాక్సిన్లు వినియోగంలోకి వచ్చాయని, మరిన్ని వ్యాక్సిన్లు రానున్నట్లు ఆమె వెల్లడించారు. వినియోగంలో ఉన్న రెండు వ్యాక్సిన్లను మరో 100 దేశాలకు సరఫరా చేస్తున్నట్లు కూడా చెప్పారు. ఆరోగ్యం, సంరక్షణకు 2021-22లో రూ.2.23 లక్షల కోట్లు కేటాయించినట్లు నిర్మల తెలిపారు. ఇది గతేడాది కంటే 137 శాతం ఎక్కువని చెప్పారు.

## సిరిసిల్లలో అత్యాధునిక ప్రభుత్వ పాఠశాల




జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ప్రారంభించిన మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్లా, ఫిబ్రవరి 1 (నేటినిజం ప్రతినిధి):రాష్ట్రవ్యాప్తంగా బడిగంటలు మోగిన వేళ సిరిసిల జిల్లా కేంద్రంలో కార్పొరేట్ స్కూల్ తలదన్నేలా నిర్మించిన జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను మంత్రి కెటిఆర్ ప్రారంభించారు. మంత్రి కేటీఆర్ చొరవతో 'గివ్ తెలంగాణ స్వచ్ఛంద సంస్థ' సహకారంతో సుమారు రూ.3 కోట్లతో ఈ పాఠశాలను నిర్మించారు. 1960లో ప్రారంభమైన ఈ పాఠశాలలో ప్రస్తుతం 600 మంది విద్యార్థులు విద్యనభ్య సిస్తున్నారు. కాగా, పాత భవనాలను కూల్చి మొత్తం 33 రూములతో సుమారు వెయ్యి మంది విద్యనభ్యసించేలా అత్యాధునిక వసతులతో నూతన భవనాన్ని నిర్మించారు. పాఠశాలలో.. రూ.30 లక్షలతో వాలీబాల్, ఫుట్‌బాల్ కోర్టులను ఏర్పాటు చేశారు. ఒకేసారి 400 మంది విద్యార్థులు కూర్చుండి భోజనం చేసేలా డైనింగ్ హాల్, అత్యాధునిక గ్రంథాయలం, సురక్షిత తాగు నీరు, 50 కంప్యూటర్లతో డిజిటల్ ల్యాబ్, అధునాతనమైన సైన్స్, మాథ్స్ ల్యాబ్‌లు, మోడ్రన్ టాయిలెట్స్, 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు జాతీయ స్థాయిలో ర్యాంకులు వస్తున్నాయని మంత్రి కేటీఆర్ అన్నారు. పిల్లలకోసం ఎంత చేసినా తక్కువేనని చెప్పారు. సిరిసిల్ల పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలో ఆధునీకరించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంత్రి ప్రారంభించారు.

### ఆధునిక హంగులతో పునర్నిర్మాణం
### -ప్రారంభించిన మంత్రి కెటిఆర్

కార్పొరేట్ స్థాయిలో స్కూల్ బిల్డింగ్‌ను నిర్మించడంతో రాష్ట్రంలో సిరిసిల్ల ప్రభుత్వ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహమే తనను ఇంతటివాడిని చేసిందని వెల్లడించారు. 1960లో ఏర్పాటైన ఈ పాఠశాల ఎంతో మందిని ప్రయోజకులను చేసిందన్నారు. పలు సేవా సంస్థల సహకారంతో కరోనా సమయంలో ఈ పాఠశాల పునర్నిర్మించామని తెలిపారు. నాలుగు వందల మంది ఒకేసారి భోజనం చేసే విధంగా డైనింగ్ హాల్, కంప్యూటర్ ల్యాబ్, 39 తరగతి గదులతో భవనాన్ని నిర్మించామన్నారు. ఇలాంటి పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు కావా లని సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని చెప్పారు. రాష్ట్రంలో 945 గురుకులాలను ఏర్పా టు చేశామని, ఒక్కో విద్యార్థికి రూ.1.25 లక్షలు ఖర్చుచేస్తున్నామని వెల్లడించారు. విదేశాల్లో చదువుకునేందుకు రూ.29 లక్షల విద్యారుణం ఇస్తున్న రాష్ట్రం ఒక్క తెలంగాణ మాత్రమేనని చెప్పారు. ఉద్యోగం కోసం చదువు కాకుండా.. విద్యా విజ్ఞానం నేర్పేలా విద్యార్థులు తయారు కావాలని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని చెప్పారు

## పరిశోధనలకు బడ్జెట్‌లో పెద్దపీట
### 50 వేల కోట్లు కేటాయింపు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): పరిశోధనకు పెద్దపీట వేయనున్నది కేంద్ర ప్రభుత్వం. జాతీయ పరిశోధనా సంస్థను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఎన్ఆర్ఎఫ్ కోసం 50 వేల కోట్లు కేటాయించారు. లోక్‌సభలో ఆమె బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఈ విషయాన్ని వెల్లడించారు. నేషనల్ రీసర్చ్ ఫౌండేషన్ కోసం కేటాయించిన నిధులను రానున్న అయిదేళ్లలో ఖర్చు చేయనున్నారు. ఎన్ఆర్ఎఫ్‌తో పరిశోధనా వాతావరణాన్ని బలోపేతం చేస్తామన్నారు. పరిశోధనా సంస్థను ఏర్పాటు చేయడం సంతోషకరమని నిపుణులు రియాక్ట్ అవుతున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని శాస్త్రలోకం స్వాగతిస్తున్నది. ఏకలవ్య స్కూళ్ల ఏర్పాటు కోసం 40 కోట్లు కేటాయించారు.

## బడ్జెట్‌తో మార్కెట్లు సానుకూలం
### భారీగా పెరిగిన సూచీల ధరలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): హెల్త్‌కేర్, ఆటో, రోడ్ల రంగానికి నిధుల కేటాయింపుపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫోకస్ పెట్టడంతో స్టాక్ మార్కెట్లలో బుల్.. రంకేసింది. సోమవారం మధ్యాహ్నం 1.25 గంటలకే బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 1700 పాయింట్లు దాటింది. మరోవైపు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 14,100కు చేరువలో ఉంది. బీఎస్ఈ క్యాపిటల్ గూడ్స్ సుమారు 4 శాతం పెరిగాయి. రెండు బ్యాంకులను ప్రైవేటీకరించనున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో ఇన్వెస్టర్లు బ్యాంకుల షేర్ల కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇచ్చారు. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఆరు శాతం పెరిగితే ప్రైవేట్ బ్యాంక్ ఐసీఐసీఐ బ్యాంకు 11.06 శాతం దూసుకెళ్లింది. ప్రభుత్వ రంగ ఎస్బీఐ 7.11 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 11.16 శాతం, యాక్సిస్ బ్యాంక్ 6.69 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా 6.10 శాతం, ఆర్బీఎల్ బ్యాంక్ 4.91 శాతం, హెచ్డీఎఫ్‌సీ బ్యాంక్ 4.24 శాతం, కొటక్ మహీంద్రా బ్యాంక్ 3 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 2.40 శాతం పెరిగాయి.

## బడ్జెట్‌లో పన్ను శ్లాబులు యధాతథం
### 75 ఏళ్లు దాటిన వారికి మాత్రమే ఊరట
### బంగారం, వెండి ధరలు తగ్గుతాయని అంచనా



న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారితో దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైంది. జనజీవితం తీవ్రంగా ప్రభావితమైంది. ఈ పరిస్థితుల్లో ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే నూతన ఆర్థిక సంవత్సరానికి గానూ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. డిజిటల్ పద్ధతిలో ప్రవేశపెట్టిన నిర్మల.. గంటా 51 నిముషాలపాటు ప్రసంగించారు. బ్జడెట్ మూలధన వ్యయం రూ.5.54 లక్షల కోట్లుగా ఆమె పేర్కొన్నారు. 20121-22 ద్రవ్యలోటు లక్ష్యం 6.8 శాతంగా ఉండనుందనే అంచనాలను వెల్లడించారు. 2025-26 నాటికి ద్రవ్యలోటు లక్ష్యం 4.5 శాతంగా ఉంటుందని అంచనా వేశారు. 2022లో రూ.12 లక్షల కోట్ల అప్పులు తేవాలని నిర్ణయించినట్టు ఆర్థికమంత్రి చెప్పుకొచ్చారు. అయితే ఆదాయ పన్నులపై ఎలాంటి క్లారిటీ ఇవ్వకపోవడంతో 2021-22 బడ్జెట్ పై భారీ ఆశలు పెట్టుకున్న మధ్యతరగతి ఉద్యోగులకు నిరాశే మిగిలింది. వయో వృద్ధులకు ఎలాంటి పన్ను దాఖలు చేయాల్సిన అవసరం లేదన్నారు. పన్నులు చెల్లించేవారిపై ఈ బ్జడెట్ నీళ్లు చల్లింది. వారికి ఎలాంటి మినహాయింపులూ ప్రకటించలేదు. ఆదాయపన్ను శ్లాబుల్లో కేంద్రం ఎలాంటి మార్పులూ చేయలేదు. దీంతో పన్ను చెల్లింపుదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. మధ్య తరగతి ప్రజలు ఎంతైతో ఆశలు పెట్టుకున్నారో... అవన్నీ నిరాశలయ్యాయి. మరోవైపు 75 ఏళ్లు దాటిన వారికి మాత్రం కేంద్రం భారీ ఊరటనిచ్చింది. 75 ఏళ్లు దాటినవారు ఆదాయపన్ను రిటర్న్ దాఖలు చేయాల్సిన అవసరం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అలాగే చిన్న పన్ను చెల్లింపుదారులకు వివాద పరిష్కార కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరో కోటి మందికి 'ఉజ్వల' పథకాన్ని విస్తరిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. రానున్న మూడేళ్లలో మరిన్ని జిల్లాలకు ఇంటింటికీ గ్యాస్‌ను సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. జమ్మూ కశ్మీర్‌లో నూతనంగా గ్యాస్ పైప్‌లైన్‌ను ప్రారంభిస్తామని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. అయితే బంగారం ధరలు భారీగా తగ్గనున్నాయి. వెండి ధరలు కూడా తగ్గనున్నాయి. సంస్కరణల కారణంగా బంగారం, వెండి ధరలు తగ్గనున్నట్లు తెలుస్తోంది. అయితే ఎలక్ట్రికల్, ఆటోమోటివ్ విడిభాగాలు, మొబైల్ ఫోన్స్ తదితరాల ధరలు మాత్రం పెరగనున్నాయి.

## మళ్లీ సైన్యం గుప్పిట్లోకి మయన్మార్

### ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని రద్దు చేసినట్లు ప్రకటన
### ఆంగ్‌సాన్ సూకీ తదితరుల నిర్బంధం
### ఏడాదిపాటు దేశంలో ఎమర్జెన్సీ విధిస్తున్నట్లు ప్రకటన
### తాజా ఘటనలపై అగ్రరాజ్యం అమెరికా ఆగ్రహం

న్యూఢిల్లీ,జఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): ఒకప్పటి బర్మా ఇప్పటి మయన్మార్లో అనూహ్య పరిణామాలు ప్రకంపనలు పుట్టించాయి. మరోమారు సైన్యం అక్కడ ప్రభుత్వాన్ని ఆధీనంలోకి తీసకుంది. అత్యవసర పరిస్థితుల్లో ఒక సంవత్సరం పాటు దేశాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు ఆ దేశ సైన్యం తన సొంత టెలివిజన్ ఛానల్ ద్వారా ప్రకటించింది. గత 50 ఏళ్లుగా సైన్యం చేతిలోనే మగ్గి తేరుకున్న ఆ దేశంలో తిరిగి సైనిక తిరుగుబాటుతో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. దేశంలో ఏడాది పాటు ఎమర్జెన్సీ ప్రకటించిన సైన్యం నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసీ నేత ఆంగ్ సాన్ సూకీని అదుపులోకి తీసుకుంది. మయన్మార్ ఘటనలు ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అంతేకాదు దేశమంతటా ఇంటర్‌నెట్ సేవలను ఆర్మీ నిలిపివేసింది. దీంతో అనేక మొబైల్ ఫోన్ నెట్‌వర్క్‌లు కూడా పనిచేయడంలేదు. సోమవారం సైనిక చర్య అనంతరం అంగ్ సాన్ సూకీని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దేశం తమ పాలనలోకి వచ్చేసిందని ఆర్మీ ప్రకటించింది. ఎన్నికల అనంతరం అక్కడ ప్రజాస్వామ్య ప్రభుత్వానికి మిలటరీకి మధ్య ఉద్రిక్తతల

రాజుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తెల్లవారుజామున సైనికులు దాడి జరిపి అంగ్ సాన్ సూకీతో పాటు ఆ పార్టీకి చెందిన ఇతర సీనియర్ వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని ఆ పార్టీ ప్రతినిధి వెల్లడించారు.. గత నవంబర్‌లో నిర్వహించిన ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని సైన్యం ఆరోపించింది. ఈ ఆరోపణలను ఇప్పటికే సూకీ ప్రభుత్వం ఖండించింది. మరోవైపు అయితే మిలటరీ చర్యపై అమెరికా ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యం నెలకొల్పే దిశగా జరిగిన ప్రయత్నాలను అడ్డుకుంటే సహించేది లేదని ప్రకటించింది. అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని, ఎన్నికల ఫలితాలను గౌరవించాలని మయన్మార్ సైన్యాన్ని కోరింది. దేశంపై నియంత్రణ కోసం మిలటరీ మరోసారి ప్రయత్నిస్తోందని ఆరోపించిన ఆస్ట్రేలియా ప్రజలు ఎన్నుకున్న నేత అంగ్ సాన్ సూకీ సహా ఇతర నేతలను విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

### చరిత్రలో నేటినిజం



కం॥ మన కాంగ్ల భాషలో గల
చణాతము రూపింపగలుగు చైతన్యముగా
వినతులు గాను రచనలలో
ఘనుడగు 'కుష్వంత సింగు' ఖ్యాతుండయ్యెన్!!

(ఫిబ్రవరి 2 కుష్వంత్‌సింగ్ జయంతి...)



-రాధశ్రీ
సెల్: 9494481210

## బడ్జెట్‌లో తెలంగాణకు దక్కని ప్రాధాన్యం

హైదరాబాద్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కేంద్ర బడ్జెట్ సమాజంలోని అన్ని వర్గాలను నిరాశకు గురిచేసిందని బీసీ కమిషన్ మాజీ సభ్యులు డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. కేంద్రం ఈబడ్జెట్ లో ప్రకటించినట్లుగా ఆత్మ నిర్భర్ బడ్జెట్ గా కాకుండా ఆత్మ నిబ్బరం ఇవ్వలేని పేలవమైన బడ్జెట్గా చరిత్ర పుటల్లో నిలుస్తుందన్నారు. పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. తెలంగాణ రాష్ట్ర అవసరాలను, విజ్ఞప్తులను పెడచెవిన పెట్టిందని దుయ్యబట్టారు. దేశంలోని 52 శాతం జనాభా కలిగిన ఓబీసీల సంక్షేమ అభివృద్ధిని గాలికొదిలేసిందన్నారు. నిధుల కేటాయింపులో సవతి తల్లి ప్రేమను ప్రదర్శించినట్లు తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో చిన్నాభిన్నమైన చిన్న కుటుంబాలను ఆదుకుంటుందేమో అని ఎదురు చూసిన వారికి నిరాశనే మిగిలిందన్నారు.

## బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

### రైతుల ఆదాయం రెట్టింపు చేసేలా కేటాయింపులు
### అన్ని వర్గాలను సంతృప్తి పరిచేలా ఉంది
### పారదర్శకతతో కూడిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టామన్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కొత్త అవకాశాలు కల్పించేలా బ్జడెట్-2021 రూపకల్పన జరిగిందని, అన్ని వర్గాలను సంతృప్తి పరిచేలా ఉందని పేర్కొన్నారు. రైతుల కోసం పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. పారదర్శకతతో కూడిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని హర్షం వ్యక్తం చేశారు. బ్జడెట్‌పై ప్రత్యేకంగా జాతినుద్దేశించి మాట్లాడిన ప్రధాని మోడీ.. దేశ ప్రజలకు మేలు చేసేలా కేంద్ర బ్జడెట్ ఉందని పేర్కొన్నారు.. అన్ని వర్గాలకు చేయూత నిచ్చేలా బ్జడెట్ ఉందని, మౌలిక వసతులకు పెద్ద పీట వేశారని తెలిపారు. కాగా విపక్షాల ఆందోళనల నడుమ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా మూడోసారి కేంద్ర ఆర్థిక బ్జడెట్‌ను సోమవారం పార్లమెంటులో ప్రవేశపెట్టారు. కరోనా లాక్‌డౌన్ కారణంగా ఎదురైన విపత్కర పరిస్థితుల నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థకు ఈ బ్జడెట్ కొత్త ఊతం ఇస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ అంశంపై స్పందించిన ప్రధాని మోదీ.. ఇంతకు ముందెన్నడూ లేని అసాధారణ పరిస్థితులలో కేంద్ర బ్జడెట్ 2021 ప్రవేశ పెట్టబడింది. తద్వారా భారత్ ఎంతటి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలదో మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. అన్ని వర్గాలకు మేలు చేకూర్చే విధంగా బ్జడెట్‌ను రూపొందించాం. రైతుల ఆదాయాన్ని పెంచే అంశాలపై దృష్టి సారించాం. ఇకపై అన్నదాతలు సులభంగా రుణాలు పొందగలుగుతారు. వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన నిధి(అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) సాయంతో ఏపీఎంసీ మార్కెట్లను బలోపేతం చేసేందుకు బాటలు పడ్డాయి. సామాన్యుడిపై పన్ను భారం వేస్తామని అందరూ భావించారు. కానీ అలాంటివేమీ లేకుండా పూర్తి పారదర్శకంగా ఈ బ్జడెట్ ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత దృఢ సంకల్పాన్ని, ఆత్మనిర్భర్ భారత్‌ను ప్రపంచానికి చాటుతోందని తెలిపారు ప్రధాని మోడీ. స్వయంసమృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవర్చేలా కేంద్ర బ్జడెట్‌ను నిర్మలా సీతారామన్, ఆమె బృందం తీర్చిదిద్ది ప్రవేశపెట్టారని ప్రశంసించిన ఆయన. బ్జడెట్ వృద్ధికి ఊతమిస్తోందని.. యువతకు కొత్త అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆదాయం, వెల్ నెస్ మరింత పెరుగుతోందని చెప్పారు ప్రధాని.. అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని చెప్పుకొచ్చిన ఆయన.. రైతుల ఆదాయం పెంచేందుకు చక్కగా ప్రణాళికలు రచించారని కొనియాడారు. ప్లలెల్లో గల రైతుల హృదయం నుంచి ఈ బ్జడెట్ పుట్టుకొచ్చిందని అభివర్ణించారు ప్రధాని మోడీ.. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ సహాయంతో ఏపీఎంసీ మార్కెట్లు పటిష్టమవుతాయని అన్నారు. యువతకు కొత్త అవకాశాల కల్పనతో పాటు మానవ వనరులు, మౌలిక వసతుల వృద్ధితో సాంకేతకపరంగా పురోగమించడానికి బ్జడెట్ సంస్కరణలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు ప్రధాని మోడీ.

# రామభక్తి కన్నా..స్వామి భక్తే మిన్న !

నేటినిజం
మంగళవారం 2-2-2021

కొన్ని వందల ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం చూపిన తరవాత అయోధ్యలో ఆలయ నిర్మాణం జరగ బోతున్న వేళ తెలంగాణలోనే ..అధికార టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎందుకు నోరు పారేసుకుంటున్నారు.. ఎందుకు రామాలయపై విమర్శలు చేస్తున్నారు. మైనార్టీల్లో తమ ప్రతిష్ట ఎక్కడ మసకబారుతుందో అన్న ఆందోళనలు వారిని వెన్నాడుతున్నాయా.... లేక బిజెపి బలపడుతుందన్న భయమా అన్నది తెలియదు. అయితే కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు..తరవాత పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిల వ్యాఖ్యలు చూస్తుంటే వారు ..తమకుతాముగా ఈ వ్యాఖ్యలు చేశారని అనుకోవడానికి లేదు. ఎందుకంటే కోరుట్ల ఎమ్మెల్యే తన వాచాలతను ప్రదర్శించాక తీవ్రస్థాయిలో నిరసనలు వచ్చాయి. జగిత్యాల జిల్లాలో ఆయనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు సాగాయి. చివరకు తానుకూడా రాముడి భక్తుడినేనంటూ ప్రకటించి.. తప్పుగా మాట్లాడి ఉంటే క్షమించాలన్నారు. కానీ తాజాగా పరకాల ఎమ్మెల్యే కూడా అదే తరహాలో విమర్శలు చేసి..విరాళాలను ప్రశ్నించారు. ఎందుకు అలా అనాల్సి వచ్చిందన్నది తెలియాలి. చల్లా వ్యాఖ్యలపై బిజెపి నేతలు భగ్గుమన్నాక దానిని ఖండించిన టిఆర్ఎస్ అగ్రనేతలు..అసలు చల్లా వ్యాఖ్యలపై మాత్రం మాట్లాడడం లేదు. అయితే దీనిని బట్టి ఓ పద్దతి ప్రకారం టిఆర్ఎస్ నేతలు విమర్శలకు దిగుతున్నారని అర్థం చేసుకోవాలి. ఇది ఇంతటితో ఆగుతుందని అనుకోవడానికి లేదు. పరకాల ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరిగితే విమర్శలకు దిగిన కెటిఆర్, ఎర్రబెల్లి, కడియం తదితరులు కోటానుకోట్ల భక్తుల విశ్వాసాలపై టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటే ఎందుకు నోరు మెదపటం లేదో గుర్తించడం లేదు. తన పార్టీ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించాల్సిన మంత్రి కేటీఆర్.. మరింతగా రెచ్చగొట్టేలా ప్రకటనలు చేయడం దారుణం. దమ్ముంటే చూసుకుందామన్న రీతిలో మంత్రులు మాట్లాడడం వారి నైరాశ్యానికి పరాకాష్టగా చూడాలి. పార్టీ ఎమ్మెల్యేలకు బుద్ది చెప్పాల్సిన కెటిఆర్ రెచ్చి పోయి మాట్లాడడం ఆయనకు తగునా అన్నది ఆలోచించాలి. కేటీఆర్ రెచ్చగొట్టే ప్రకటన చూస్తుంటే రామ మందిరంపై ఎమ్మెల్యేల మాటలు టీఆర్ఎస్ విధానంగా భావించాల్సి వస్తుంది. హిందువుల విశ్వాసాలు గాయ పరచడంలో టీఆర్ఎస్ ఎంఐఎంతో పోటీ పడుతుందన్న విమర్శలకు సమాధానం చెప్పాలి. రామ కార్యానికి అడ్డుపడాలని చూస్తే ప్రజలు క్షమించరని బిజెపి, విశ్వహిందూపరిషత్ నేతలు అంటున్నారు. శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు కార్యకలాపాలపై ఇకపై ఎవరైనా అనవసరంగా నోరు జారితే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని విహెచ్‌పి నేతలు హెచ్చరించారు. ఇకపోతే కేటీఆర్‌ను సీఎంను చేయాలం టోన్న వారు ఆశిస్తోంది ఏంటి? ఎందుకు పోటీపడి ప్రకటనలు చేస్తున్నారు? పార్టీ వారిని అలా మాట్లాడమని చెప్పిందా లేక.. ఆ నేతలే తొందర పడుతున్నారా అన్నది కూడా అర్థం కావాల్సి ఉంది. కెటిఆర్ సిఎం అవుతాడని ప్రచారం చేస్తున్న వేళ కొందరు కావాలనే బిజెపిని ఎదుర్కొనేందుకు రామాలయ నిర్మాణాలపై విమర్శలకు దిగుతున్నారా లేక..కెటిఆర్ ఆదేశాలతోనే విమర్శలుచేస్తున్నారా అన్నది కూడా ప్రజలకు అర్థం కావాలి. గత కొన్నినెలలుగా కేటీఆర్ కాబోయే సీఎంగా టీఆర్ఎస్ నేతల ప్రచారం చేసుకుంటూ పోతున్నారు. అలాగే బిజెపి కూడా దూకుడుగా వ్యవహరిస్తోంది. మరోవైపు జమిలి ఎన్నికలు వస్తాయనన ప్రచారం కూడా సాగుతోంది. జమిలి ఎన్నికలకు ముందే కెటిఆర్‌ను సిఎం చేసేందుకు కటుంబంలో కూడా ఒత్తిడి జరుగుతోందన్న ప్రచారం సాగుతోంది. ఇందులో ఏది నిజమో..కాదో కాని..ఓ పథకం ప్రకారం టిఆర్ఎస్ రాజకీయాలు నడుస్తున్నాయి. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్ తదుపరి తెలంగాణ సీఎం అవుతారన్న ప్రచారం జోరుగా సాగుతున్నా కెసిఆర్ కుటుంబ సభ్యులు కానీ..

కెటిఆర్ కానీ ఖండించడం లేదు. స్వయంగా కెసిఆర్ కూడా దీనిపై ఎలాంటి ఖండనా చేయడం లేదు.

మొత్తంగా అధికార పార్టీతోపాటు విపక్ష పార్టీలలోనూ ఈ అంశంపై హాట్‌హాట్‌గా చర్చ జరుగుతోంది. ముహూర్తం ఖరారైందని.. త్వరలోనే పట్టాభిషేకం ఉంటుందని అధికారపార్టీ వర్గాలు చర్చించుకుంటు న్నాయి. అధికారపార్టీలోని పలువురు ప్రజాప్రతినిధులు ఒకరి తర్వాత ఒకరు కేటీఆర్ సీఎం అవుతారని చెప్పడంలో పోటీ పడుతున్నారు. గతంలోనూ ఈ అంశంపై చర్చ జరిగిన సమయంలో దానికి అసెంబ్లీలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఫుల్‌స్టాప్ పెట్టారు. ఇలా కెటిఆర్‌కు వర్గమంటూ ఒకటి ఏర్పడడం వారు.. ఇష్టాను సారంగా ప్రకటనలు చేయడం..పనిలో పనిగా బిజెపి లక్ష్యంగా రామాలయంపైనా విమర్శలు చేయడం ..దానిని కెటిఆర్ వెనకేసుకుని రావడం అంతా ఓ పద్దతి ప్రకటం సాగుతుందని అర్థం అవుతోంది.ఈ తరుణంలో కెటిఆర్ సిఎం అవుతారన్న ప్రచారం రెండోసారి తెరమీదకు బలంగా వచ్చింది. మంత్రులు, ఎమ్మెల్యేలు.. ఒకే రకమైన కోరస్ వినిపిస్తున్నారు. సీఎం పీఠంపై కూర్చొనేందుకు కేటీఆర్‌కు అన్ని అర్హతలు ఉన్నాయని చెబుతున్నారు. అంటే కెసిఆర్‌ను బలవంతంగా రెస్ట్ తీసుకోవాలని చెబుతున్నారా అన్నది కూడా చెప్పకనే చెబుతున్నారు. ఇలాంటి సమయంలో ఎమ్మెల్యే రసమయి చేసిన కామెంట్స్ పార్టీలో చర్చకు దారితీస్తున్నాయి. తెలంగాణ వచ్చాక పాటలు మారిపోయాయన్నారు రసమయి. కలాలు.. గళాలు మౌనంగా ఉంటే కేన్సర్ కంటే ప్రమాదమని వ్యాఖ్యానించారు. రసమయి ఈ సమయంలో ఎందుకిలా మాట్లాడారన్నది పార్టీలో చర్చ జరుగుతోంది. కేటీఆర్ దృష్టిలో పడటమే నేతల లక్ష్యంగా ఉందన్నది మాత్రం నిజం. కేటీఆర్ సీఎం అయ్యే పరిస్థితి ఉంటే ప్రస్తుతం ఉన్న కేబినెట్ రద్దు అవుతుంది. సొంతంగా మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అందుకే కేబినెట్‌లో ఉన్నవారు తమ సీటును పదిలం చేసుకునేందుకు కేటీఆర్‌ను పొగడ్తల్లో ముంచెత్తుతున్నారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇందులో మంత్రి పదవులు ఆశిస్తున్న వారు ఇలా వివాస్పద వ్యాఖ్యలుచేస్తున్నారా అన్నది కూడా తెలియడం లేదు. మొత్తానికి బిజెపిని ఎదుర్కోవడమా.. లేక..కెటిఆర్‌ను ప్రసన్నం చేసుకోవడమా అన్న అంశంపై త్వరలోనే స్పష్టత రానుంది.

## సంగారెడ్డి జిల్లా ఆందోల్‌లోని బాలికల సాంఘీక గురుకుల జూనియర్ కళాశాల ను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి హరీశ్ రావు



సంగారెడ్డి ఫిబ్రవరి 1 (నేటినిజం ప్రతినిధి) రేపటి నుంచి విద్యాలయాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆకస్మిక తనిఖీ చేపట్టిన మంత్రి. కళాశాల ప్రిన్సిపాల్, కేర్ టేకర్, అసిస్టెంట్ కేర్ టేకర్, వంట మనుష్యులు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి హరీశ్ రావు. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి. ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ తో ఫోన్ లో మాట్లాడిన మంత్రి. సిబ్బందికి తగిన ఆదేశాలివ్వాలని సూచన.రేపటి నుండి పాఠశాలలు ప్రారంభం అవుతాయని, తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సమీక్ష నిర్వహించి చెప్పినా ఏంటీ ఈ పరిస్థితి అని అక్కడ ఉన్న సిబ్బంది ని ప్రశ్నించిన మంత్రి. ఏర్పాట్లను పరిశీలించేందుకు వసతి గృహం వద్దకు వెళ్లగా తాళాలు తమ వద్ద లేవని మంత్రికి చెప్పిన సిబ్బంది. ఈ రాత్రి ఎవరైనా విద్యార్థులు వస్తే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి హరీశ్ రావు. మంత్రి వెంట జెడ్పి చైర్ పర్సన్ మంజు శ్రీ, శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ ఉ న్నారు.

## 15 ఏళ్ల తరవాత తల్లిదండ్రులు వద్దకు బిడ్డ

### –చిన్నప్పుడే తప్పిపోవడంతో గుర్తింపు సమస్య

హైదరాబాద్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ):రెండున్నరేళ్ల వయసులో తప్పిపోయిన తన కుమార్తె ఫాతిమా .. తిరిగి వచ్చిందన్న ఆనందం వారికి కలగడం లేదు. ప్రస్తుతం ఎక్కడుందో.. ఎలా ఉందో.. అసలు బతికి ఉందో లేదో అనే ఆలోచనలతో గత పదిహేనేళ్లుగా తపించిన ఆ తల్లి ఇప్పుడు కూతురు తమను గుర్తు పట్టడం లేదు. దాదాపు 16 ఏళ్ల తర్వాత వారి గుండెకోతను దూరం చేశాడు. చివరకు కుమార్తెని తల్లిదండ్రుల వద్దకు చేర్చాడు. దాదాపు 16 ఏళ్ల క్రితం కర్నూలుకు చెందిన ఫాతిమా తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వచ్చింది. మక్కా మసీదు సందర్శనలో ఉండగా.. తప్పిపోయింది. అప్పటి నుంచి వెతుకుతుండగా..16 ఏళ్ల తర్వాత హైదరాబాద్‌లోని ఓ చిల్డ్రన్ హోంలో తనను గుర్తించారు. ప్రస్తుతం ఆమెని కుటుంబం వద్దకు చేర్చారు. అయితే ఇక్కడ ఓ ఆశ్చర్యకరమైన విషయం బయటపడింది. ముస్లిం కుటుంబంలో జన్మించిన ఫాతిమా.. ఆ తర్వాత 15 ఏళ్లు హోంలో స్వప్న పేరుతో హిందువుగా పెరిగింది. ఆమె ప్రస్తుతం తన కుటుంబ సభ్యులను గుర్తుపట్టలేకపోతుంది. ఈ సందర్భంగా ఫాతిమా అలియాస్ స్వప్న సోదరుడు అబిద్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఇది ఓ ఉద్వేగభరిత సన్నివేశం. మేం ఫాతిమాను మా ఇంటికి తీసుకెళ్లి.. బంధువులు, స్నేహితులకు పరిచయం చేస్తాం. ఆ తర్వాత ఆమెను తిరిగి హోంకు పంపిస్తాం. తన చదువును కొనసాగిస్తుంది' అని తెలిపాడు.

# రైతులను కంట్రోల్ చేస్తున్న శక్తులు ఎవరు?

### ప్రధాని ప్రకటన తరవాత కూడా ఎందుకు చర్చలకు రావడం లేదు
### సరిహద్దు ప్రజలు వ్యతిరేకిస్తున్నా మొండికేయడంలో ఆంతర్యం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): రైతులు నానా తంటాలు పడుతున్నారు. అందుకే ఢిల్లీ సరిహద్దులు వీడి వెళ్లడానికి ఇష్టపడడం లేదు. తాడోపేడో తేల్చుకుంటామని చెబుతున్నారు. ఫలితంగా ఉద్యమ నాయకత్వం లో కొంత దృఢత్వం సడలినప్పటికీ తేరుకుని తమను తాము తమాయించుకుని మాట్లాడేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. గణతంత్ర దినోత్సవంసందరర్భంగా జరిగిన అపశృత ఎలకు తమకు సంబంధం లేదని చెప్పుకుం ఎందుకు నానా తంటాలు పడుతున్నారు. ట్రాక్టర్ ర్యాలీ సందర్భంగా జరిగిన సంఘటనలకు కారకులెవరైనప్పటికీ, వాటికి కారకులు రైతు ఉద్యమకారులేనని విమర్శలు వచ్చాయి. రైతులే అసాంఘిక శక్తులను ప్రోత్సహించారని విమర్శలు వచ్చాయి. చట్టాలను ఏడాదిన్నర పాటు నిలిపివేస్తామని కేందప్రభుత్వం చేసిన ప్రతిపాదనను సద్వినియోగం చేసుకునేందుకు రైతులు ముందుకు రావడంలేదు. ప్రధాని తాజా ప్రతిపాదనలతో ముందుకు వచ్చినా వారు పట్టువీడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. చట్టాలరద్దు, మద్దతుధరకు చట్టప్రతిపత్తి వంటి డిమాండ్లకు తాము కట్టుబడి ఉన్నామని రైతుసంఘాల వేదిక సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటించింది. ఇక ప్రభుత్వం మరిన్ని అడుగులు ముందుకు వేయవలసి ఉంటుందని అంటున్నారు. నిజానికి, ఈ ఆందోళన త్వరగా కొలిక్కివచ్చేది కాదని రైతులకు తెలుసు. ఎంతకాలమైనా ఉద్యమాన్ని కొనసాగించాలన్న దాంట్లో అర్థం లేదు. ఈ మొండితనం వల్లనే గణతంత్ర దినోత్సవం కారణంగా సమస్య జటిలమయింది. అయితే, అనేక సంఘాల నాయకత్వంలో నడుస్తున్న ఉద్యమంలో రకరకాల అభిప్రాయాలు వ్యక్తం కావడం సహజం. మరి కొందరు నిలుపుదల కాలాన్ని ఏడాదిన్నర నుంచి రెండేళ్లకు, అంతకు మించి పెంచమని డిమాండ్ చేయాలని భావిస్తున్నారు. ఒకస్థాయికి చేరిన ఉద్యమాన్ని కాపాడుకోవాలనే తపన రైతుసంఘాల్లో బలంగా ఉన్నది. ఇదే సమయంలో రైతుల ఉద్యమాన్ని అణచివేతకు ప్రజల లభిస్తుందని ప్రభుత్వం భావిస్తున్నది. ఉద్యమనాయకుల మీద కేసులు మోపడంతో పాటు ఢిల్లీ సరిహద్దుల్లో రైతులను తొలగించడానికి కఠినంగా వ్యవహరిస్తున్నది. మరోవైపు రైతులకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలుకూడా నిరసలను దిగుతున్నారు. ఘాజీపూర్ నుంచి రైతులు ఖాళీచేసి వెళ్లిపోవాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అల్టిమేటమ్ ఇచ్చింది. ప్రతిపక్షాలు రైతులకు మద్దతుగా నిలబడడంతో బలాన్ని కూడగట్టుకోవాలని కూడా రైతులు నిర్ణయించుకున్నారు. రైతులకు మద్దతుగా 18 పార్టీలకు చెందిన విపక్షాలు రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించారు. అయితే తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రాంతీయ పార్టీలేవీ ఇందుకు తోడు నిలవలేదు. తెలంగాణలో అధికార టిఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ ఇందులో ఉన్నాయి.కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఢిల్లీలో రైతుల ఆందోళనపై సమీక్షించిన వారిని తప్పించేందుకు యత్నాలుమొదలు పెట్టారు. అయితే రిపబ్లిక్ డే పరిణామాలు మాత్రం ఉద్యమకారులను ఆత్మరక్షణలో పడవేశాయన్నది మాత్రం నిజం.

# తెలంగాణ ఉద్యోగ సంఘాలకు పరీక్ష

### ఫిట్మెంట్‌పై ఉద్యోగుల్లో నిరసనలు
### నేతలను నిలదీస్తున్న ఉద్యోగులు

హైదరాబాద్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): పీఆర్సీ సిఫారసులతో ఇరకాటంలో పడ్డ ఉద్యోగ సంఘాల నేతలు ఇప్పుడు కెసిఆర్ పిలుపు కోసం ఎదురు చూస్తున్నాయి. అయితే తదుపరి ముఖ్యమంత్రి అని ప్రచారం చేస్తున్న కెటిఆర్ కూడా దీనిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయడం లేదు. ఉద్యోగ సంఘాలు మాత్రం తాడోపేడో తేల్చుకుంటామని అంటున్నాయి. ఆందోళనలు కూడా చేస్తున్నాయి. ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా పనిచేస్తోందన్న భావనలో తెలంగాణలోని చాలా సంఘాలకు ఉంది. గత కొన్నాళ్లుగా ఇదే ప్రచారం జరుగుతోంది. తాజాగా పిఆర్సీ నివేదికతో ఇది బట్టబయలుఅయ్యిందని చెబుతున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసినా ఇరకాటం తప్పడం లేదన్న ఆవేదనలో ఉద్యోగ సంఘాల నేతు లున్నారు.ఇలాంటి సమయంలో వచ్చిన పిఆర్సీ నివేదిక ఉద్యోగ సంఘాల నేతలకు కక్కలేని..మింగలేని పరిస్థితి తీసుకొచ్చింది. దీంతో అనేక చోట్ల సంఘాలు ఆందోళన బాట పట్టాయి. పిఆర్సీ నివేదిక అనుకూలంగా వస్తుందని.. సీఎం మీద నమ్మకం ఉందని ప్రకటిస్తూ వచ్చిన రెండు ప్రధాన యూనియన్లు సైతం ప్రభుత్వం తీరుపై గుర్రుగా ఉన్నాయి. రిపోర్ట్‌లో 7.5 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడంతో ఉద్యోగులు నీరు గారిపోయారు. బయటకు చెప్పుకోలేక నానా రకాలుగా మదన పడుతు న్నారు. దీనిని ఎలా ఎదుర్కోవాలన్న ఆలోచ నలో పడిపోయారు. అడిగిన ఫిట్‌మెంట్‌కు.. కమిటీ సూచించిన ఫిట్‌మెంట్‌కు పొంతనే లేకుండా పోయిందన్నది వారి ఆగ్రహానికి కారణం. మరోవైపు విపక్షాలు కూడా ఇదే సందర్భంలో ఉద్యోగ సంఘాలకు మద్దతుగా నిలిచాయి. ఫిట్‌మెంట్‌ను ముష్టిగా చూపు తున్నాయి. విపక్ష పార్టీల నేతలు మాత్రం నివేదికలోని సిఫారసులను తప్పుపడుతూనే ఉద్యోగ సంఘాల నాయకులను టార్గెట్ చేస్తున్నారు. డిమాండ్స్ పరిష్కారం కంటే.. ప్రభుత్వానికి దగ్గరగా ఉండేందుకే సంఘాల నాయకులు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు ఊపందుకున్నాయి. ఇప్పుడున్న ప్రతికూల వాతావరణంలో ఒక్కో సమస్య ఉద్యోగ సంఘాల నేతలను చుట్టుకుంటోంది. ఇతర సంఘాలతో కలిసి పోరాటం చేయాలా? సొంత సంఘాలలో రుసరు సలాడుతున్న నేతలను బుజ్జగించడం ఎలాగో తెలియక నేతలు సతమతం అవుతున్నారు. కమిషన్ కనీసం 20 శాతమైనా ఫిట్‌మెంట్ సూచించి ఉంటే.. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి అనుకున్నది సాధించుకోవచ్చని ఇన్నాళ్లూ భావించాయి. కానీ నామమాత్రపు సిఫారసులు చూసిన ఉద్యోగ సంఘాలకు దిమ్మ తిరిగి పోయింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువే సిఫారసు చేశామన్న బిశ్వాల్ మాటలుమరింతగా మంటపుట్టిం చాయి. అయితే కెసిఆర్ కనుసన్నల్లోనే బిశ్వాల్ నివేదిక రూపొందించారని విపక్షలు విమర్శిస్తున్నాయి. మరోవైపు ఉద్యోగ సంఘాల నేతగా ఎదిగి ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రి శ్రీనివాసగౌడ్ ద్వారా మంతనాలు సాగిస్తున్నారు. ఆయనకూడా వీరికి అనుకూలంగ ఆమాట్లాడుతూ సిఎం కెసిఆర్ న్యాయం చేస్తారని అంటున్నారు. అయితే మంత్రి ప్రకటనలు.. ఉద్యోగ సంఘాల నేతల మాటలకు పొంతనే ఉండటం లేదు. ఎవరి వాదన వారు వినిపిస్తున్నారు. వాస్తవానికి వేతన సవరణపై మూడేళ్లుగా ఎదురు చూస్తున్నారు ఉద్యోగులు. బదిలీలు, ప్రమోషన్లపైనా ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందన.. ఆయన చేసే ప్రకటన కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

## తెరుచుకున్న విద్యాసంస్థలు

### ఉత్సాహంగా వచ్చిన విద్యార్థులు
### కరోనా నిబంధనలు పాటించిన అధికారులు

వరంగల్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): జిల్లాలో పాఠశాలలు, కళాశాలలు తెరుచుకున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా తమ క్లాస్‌లకు హాజరయ్యారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,118 పాఠశాలలు, 502 ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలు తెరుచుకున్నాయి. కాకతీయ వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల్లో తరగతులు పునఃప్రారంభమయ్యాయి. కోవిడ్ నిబంధనలు అనుసరిస్తూ ప్రతి బెంచ్‌పై ఒకే విద్యార్థి కూర్చునేందుకు అనుమతించారు. వేములవాడలో పాఠశాలలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కరోనా నిబంధనలు పాటిస్తూ విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారు. థర్మల్ స్క్రీన్ చేసిన తర్వాత వారిని తరగతి గదిలోకి పంపారు. విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉపాధ్యాయులు వివరించారు. కరోనా నేపథ్యంలో సుదీర్ఘ విరామం తరువాత బడిగంటలు మోగాయి. అయితే 9, పదో తరగతి విద్యార్థులకు మాత్రమే ముఖాముఖి తరగతులను నిర్వహిస్తున్నారు. 16 వారాల పాటు తరగతులు కొనసాగనున్నాయి. ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఆన్‌లైన్ పద్ధతిలోనే తరగతులు కొనసాగుతున్నాయి.

## యువకుడిని పెట్రోల్ పోసి తగులబెట్టిన దుండగులు

హైదరాబాద్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): బాలాపూర్ పీఎస్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. సుల్తాన్‌పూర్‌లో ఓ యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సదరు యువకుడు మృతి చెందాడు. మృతుడు హరీష్(28) జిల్లెలగూడ వాసిగా పోలీసులు గుర్తించారు. బైక్ లిఫ్ట్ అడిగి ఎక్కిన వ్యక్తే ఘటనకు పాల్పడి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## కోర్టు ఆదేశాలతో బేగంపేట పోలీస్ స్టేషన్‌లో అఖిలప్రియ సంతకం

హైదరాబాద్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): బోయిన్‌పల్లి కిడ్నాప్ కేసులో భూమా అఖిలప్రియ బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు. సికింద్రాబాద్ కోర్టు ఆదేశాలనుసారం బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు హాజరై బేగంపేట ఏసీపీ నరేష్ రెడ్డి సమక్షంలో సంతకం చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అఖిలప్రియను పోలీసులు పలు విషయాల్లో ప్రశ్నించారు. పోలీసుల విచారణకు అఖిల ప్రియ సహకరించినట్లు ఏసీపీ నరేష్ రెడ్డి తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు హాజరైన అఖిలప్రియ గంటన్నరపాటు పోలీస్ స్టేషన్‌లోనే ఉండి పోలీసుల విచారణకు సహకరించినట్లు ఏసీబీ నరేష్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి అఖిలప్రియ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం చేస్తుందని తెలిపారు. భార్గవ్ రామ్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి వెతుకుతున్నట్లు ఏసీపీ నరేష్ రెడ్డి అన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

### భార్యాభర్తల మధ్య విభేదాలే కారణమని అనుమానం

జగిత్యాల,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): మల్యాల మండలం రామన్నపేట గ్రామానికి చెందిన కొండ కోమలత అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోమలత ఆదివారం అర్ధరాత్రి ఇంటి బాత్‌రూంలో శరీరం కాలిన గాయాలతో శవమై కనిపించింది. అయితే కోమల మృతికి భార్యభర్తల మధ్య విభేదాలే కారణమని మృతురాలి తల్లి ఆరోపించింది. సమాచారం అందుకున్న మల్యాల సీఐ కోరే కిశోర్, ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కోమలత ఆత్మహత్య చేసుకుందా? లేదంటే హత్యా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతురాలు గొర్రెగుండం గ్రామ పంచాయతీలో జూనియర్ పంచాయతీ సెక్రెటరీగా పని చేస్తోంది. మృతురాలి భర్త కొండ కోమలతను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# శశికల రాకతో తమిళనాడు రాజకీయాల్లో ఊపు వచ్చేనా

### అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు ఆమె వెంట నడుస్తారా
### రాజకీయాల్లో శశికళ పాత్రపై సర్వత్రా చర్చ



చెన్నై,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): త్వరలోనే తమిళనాడు ఎన్నికలు జరుగబోతున్న తరుణంలో శశికళ జైలు నుండి విడుదయ్యారు. ఆమె రాజకయాల్లో ఏ రకమైన ప్రభావంచూపుతారన్నది చర్చనీయాంశంగా మారింది. చెన్నైకి చేరుకున్నాక... తనకు మద్దతుగా నిలిచే ఎమ్మెల్యేలను, పార్టీ నేతలను తన వైపు తిప్పుకోవడమే ఆమె ముందున్న లక్ష్యం అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వీరందరి మద్దతుతో ఆమె ఎన్నికలకు సిద్ధం అయ్యే అవకాశాలు ఉన్నాయిన అంటున్నారు. అలాగే కుల రాజకీయాలకు తెరలేప వచ్చు. తేవర్ కులానికి చెందిన శశికళ.. తనకున్న మాటల, చేతల ప్రభావంతో వారిని ఆమె కూడగట్టుకోవచ్చు. పన్నీర్ సెల్వం కూడా అదే కులానికి చెందిన వారైనప్పటికీ.... వారిని ఆకర్షించలేక పోయారన్న అపవాదు ఉంది. అదేవిధంగా అన్నాడిఎంకెలో ఇప్పుడు ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వానికి చెందిన గౌండర్లది పై చేయిగా ఉంది. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాల్లో ఒక్కొక్క దానిపై ఆధిపత్యం చెలాయించేందుకు సిద్ధమైన బిజెపి... అన్నాడిఎంకెతో పొత్తుకు సై అంది. ప్రతిపక్ష డిఎంకెను ఓడించేందుకు తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను రజనీని రంగంలోకి దింపాలనుకున్నప్పటికీ ఆయన వెనక్కి తగ్గడంతో బిజెపి వ్యూహం బెడిసికొట్టింది. అయితే శశికళపై నమోదైన అవినీతి ఆరోపణల దృష్ట్యా ఈ సారి ఎన్నికల్లో నేరుగా పోటీ చేసే అవకాశాన్ని శశికళ కోల్పోయారు. దీంతో తెరవెనుక ఉండి కథను నడిపించనున్నారని తెలుస్తోంది. ఆమె అనుయాయులు కూడా ఇదే తరహాలో పావులు కదుపుతున్నారు. తమిళనాడులో ప్రాంతీయ పార్టీల ప్రభావం ఎక్కువ. ఎక్కువ మంది సినీనటులు ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన రాష్ట్రం కూడా అదే. భాష అంటే ప్రాణం... ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో ఇప్పుడు తమిళనాడు ..దేశ రాజకీయాల్లో కేంద్ర బిందువైంది. జయ మరణం తరవాత జరిగిన పరిణామాలతో వశికళ జైలుకు వెళ్లడమే గాకుండా అన్నాడిఎంకె పార్టీ నుండి బహిష్కరణకు గురికావాల్సి వచ్చింది. అనంతరం ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో బెంగళూరులోని పరప్పన్ జైలులో నాలుగేళ్లు ఖైదీగా శిక్ష అనుభవించి... గత నెల 27న విడుదలయ్యారు. అయితే కరోనా సోకడంతో...అక్కడి ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. కోలుకున్న అనంతరం చెన్నైకి చేరుకోనున్నారు. ఇటు ఆమె రాకకు ముందే రాష్ట్ర ముఖ్యమంత్రి..జయలలిత స్మృతి వనాన్ని ప్రారంభించారు.ఇప్పుడు ఆమె రాకతో తమిళనాడు రాజకీయాల్లో సమీకరణాలు మారవచ్చునని వినిపిస్తోంది. ఎవరికైతే అధికారాన్ని అప్పగించారో ...ఆ వ్యక్తే శశికళను పార్టీలో నుండి తోసివేసి...ప్రధాన కార్యదర్శి పదవి నుండి తొలగించారు. అనంతరం ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఆ ఆ తర్వాత పన్నీర్–పళనీస్వామి వర్గాలు ఒక్కతాటిపైకి వచ్చి..చివరకు ముఖ్యమంత్రి పదవిని పళనీస్వామికి అప్పగించాయి. అనంతరం శశికళ మేనల్లుడు టిటివి దినకరన్‌పై కూడా వేటు పడింది. తిరిగి అన్నాడిఎంకె తన చేతికి చిక్కేందుకు వ్యూహాలు రచించవచ్చునని లేదా కొత్త రాజకీయ పార్టీని ఊహించవచ్చునని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు.

# 5న విడుదల కానున్న స్టాఫ్ సెలక్షన్ కమిటీ నోటిఫికేషన్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉండే ఉద్యోగాలను స్టాఫ్‌సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) భర్తీచేస్తుంది. ఇందులో భాగంగా మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్) నాన్‌టెక్నికల్ పోస్టుల భర్తీకి ఈనెల 5న విడుదల కానుంది. షెడ్యూల్ ప్రకారం జనవరి 29న నోటిఫికేషన్ వెలువడాల్సినప్పటికీ.. వివిధ కారణాల వల్ల వాయిదావేశారు. ఈ నేపథ్యంలో వచ్చే శుక్రవారం విడుదల కానుంది. అయితే రేపటి నుంచి దరఖాస్తు ప్రక్రియ మొదలవుతుందని ఎస్ఎస్‌సీ ప్రకటించింది. కాగా, ఎన్ని పోస్టులను భర్తీ చేయనుందనే విషయంలో ఇంకా స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. అయితే గతేడాది 7099 పోస్టులను భర్తీ చేసింది. ఈ ఏడాది కూడా అంతేమొత్తంలో పోస్టులను ప్రకటించే అవకాశం ఉన్నది



రాజ్‌భవన్‌లో గుస్సాడి కనకరాజును సన్మానించిన గవర్నర్ తమిళసై. చిత్రంలో మంత్రి సత్యవతి రాథోడ్ కూడా ఉన్నారు.

# దిక్కుమాలిన జన్మభూమి కమిటీలు

## విమర్శించిన మంత్రి వెల్లంపల్లి

## అయోధ్యకు 5 లక్షల విరాళం

విజయవాడ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలంటూ దిక్కుమాలిన కమిటీలు వేశారని, ఇప్పుడు ఆ కమిటీలు లేకుండా గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన నగరంలోని పశ్చిమ నియోజకవర్గంలోని 38వ డివిజన్‌లో పర్యటించారు. స్థానికులు నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చిన్న పాటి సమస్యలను మంత్రి.. అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. కోర్టులో కేసులు పరిష్కారం అయిన వెంటనే అర్హులైన పేదలందరికి ఇళ్ల పట్టాలు అందిస్తామని మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. ఇదిలావుంటే యోధ్యలో రామ మందిర నిర్మాణానికి మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ వ్యక్తిగతంగా రూ.5,01,116 విరాళం అందజేశారు. సంబంధింత చెక్‌ను ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ముఖ్యులు భరత్‌కు ఆయన ఆదివారం అందజేసినట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

# వింతవ్యాధితో నాటుకోళ్లు మృతి

పెద్దపల్లి,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్ మండలం కునారం గ్రామంలో రానికిట్ అనే వ్యాధితో రైతుకు చెందిన 150 నాటు కోళ్లు మృతి చెందాయి. బర్డ్ ఫ్లూతోనే చనిపోయి ఉంటాయి అంటూ గ్రామస్థులు ఆందోళనకు దిగారు. వెంటనే అక్కడకు చేరుకున్న అధికారులు మృతి చెందిన కోళ్లను పరిశీలించి రానికిట్ వ్యాధిగా నిర్ధారించారు. కోళ్ల మృతితో రైతుకు సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లింది.

# వైకాపా తీరు దారుణం- సోము వీర్రాజు

అమరావతి,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఈసీ వర్సస్ ప్రభుత్వం అన్న తరహా వాతావరణం కనిపిస్తోంది. నిమ్మగడ్డ రమేష్ కుమార్‌ను టార్గెట్ చేస్తూ కొంతమంది మంత్రులు విమర్శలు చేస్తున్నారు. దీనిపై స్పందించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు వైసీపీ నేతలు ఈ విధంగా వ్యవహరించడం చాలా దురదృష్టకరమని అన్నారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాలేదన్నారు. ఈ విధమైన దుందుడుకు చర్యలకు ప్రభుత్వం వెళ్లకూడదన్నారు. ఇది ప్రజలు.. ఎన్నికల పోరాటమని.. కానీ ప్రభుత్వం నిమ్మగడ్డ రమేష్ కుమార్‌పై పోరాటం చేస్తున్నట్లు కనిపిస్తోందని సోము వీర్రాజు అన్నారు. ఈ విధమైన ప్రభుత్వం చర్యలను బీజేపీ పూర్తిగా ఖండిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఎన్నికలపై దృష్టి పెట్టి.. సజావుగా జరిగేలా చూడాలని సోము వీర్రాజు డిమాండ్ చేశారు.

# కారు,ఆటో ఢీకొన్న ప్రమాదంలో 12మందికి గాయాలు

కర్నూలు,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): జిల్లాలోని మంత్రాలయం మండలం మాధవరం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 12 మంది వ్యవసాయ కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. కారు, ఆటో పరస్పరం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిలో 5 గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వారిని 108లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రాముడికి అవమానం చేస్తే ఎందుకు నోరు మెదపరు: విహెచ్‌పి

హైదరాబాద్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): పరకాల ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరిగితే లేచిన నోరు కోటానుకోట్ల భక్తుల విశ్వాసాలపై టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటే ఎందుకు నోరు మెదపటం లేదని వీహెచ్ పీ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ ప్రశ్నించారు. రాముడి పేరు పెట్టుకున్నందుకైనా కేటీఆర్ తన పార్టీ ఎమ్మెల్యేలకు బుద్ధి చెప్పాలన్నారు. కేటీఆర్ రెచ్చగొట్టే ప్రకటన చూస్తుంటే రామ మందిరంపై ఎమ్మెల్యేల మాటలు టీఆర్ఎస్ విధానంగా భావించాల్సి వస్తుందన్నారు. హిందువుల విశ్వాసాలు గాయ పరచడంలో టీఆర్ఎస్ ఎంఐఎంతో పోటీ పడుతుందన్నారు. రామ కార్యానికి అడ్డుపడాలని చూస్తే ప్రజలు క్షమించరన్నారు. శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు కార్యకలాపాలపై ఇకపై ఎవరైనా అనవసరంగా నోరు జారితే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# పనిచేయని రేషన్ సర్వర్లు

విజయవాడ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): నగరంలోని వన్‌టౌన్‌లో ఇంటింటికి రేషన్ అందని పరిస్థితి నెలకొంది. వాలంటీర్లు, స్థానికులకు మధ్య వివాదంతో రేషన్ కోసం వాహనం వద్ద రోడ్ల మీద ప్రజలు బారులు తీరారు. ఇళ్ల వద్దకు రాలేమని వాలంటీర్లు స్పష్టం చేస్తుండగా...రేషన్ గురించి వాలంటీర్లు సరైన సమాచారం

ఇవ్వడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వర్లు పనిచేయట్లేదని వాలంటీర్లు చెబుతున్నారు. రేషన్ డిపోల వద్ద సౌకర్యంగా ఉందని ప్రజలు తెలిపారు

# ఇంటర్‌నెట్ సేవల సస్పెన్షన్ నేటి వరకు పొడిగింపు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): ఢిల్లీ సరిహద్దుల్లో ఇంటర్నెట్ సర్వీసులపై సస్పెన్షన్‌ను మంగళవారం రాత్రి 11 గంటల వరకు పొడిగిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ తెలిపింది. ఢిల్లీ సరిహద్దు ప్రాంతాలైన సింఘు, ఘాజీపూర్, టిక్రిల్లో సస్పెన్షన్ కొనసాగుతుందని వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా గత రెండు నెలల నుంచి ఆందోళన చేస్తున్న రైతులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సందర్భంగా ఢిల్లీలో పలు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం మళ్లీ అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఢిల్లీలో ఇంటర్నెట్ సర్వీసులపై సస్పెన్షన్ విధించింది.

# నిమ్మాడలో మీ పెత్తనమే నడవాలా?

## -అచ్చెన్నాయుడుపై విజయసాయి మండిపాటు

విజయవాడ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ):ఏపీ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో... వైసీపీ, టీడీపీ నేతల మధ్య మాటల యుద్ధం రోజు రోజుకు వేడెక్కుతోంది. ముఖ్యంగా వైసీపీ నేతలు ఎస్ఈసీ నిమ్మగడ్డ, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడులను టార్గెట్ చేస్తున్నారు. తాజాగా వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి... ట్విట్టర్ వేదికగా చంద్రబాబు, అచ్చెన్నాయుడిపై విరుచుకుపడ్డారు. 'ఏంటి అచ్చెన్నా...నిమ్మాడ అంటే చంద్రబాబు రాసిచ్చిన దివాణమా? మీరు డిక్టేట్ చేసిన వ్యక్తి తప్ప ఇంకొకరు సర్పంచ్ గా నామినేషన్ వేయకూడదా? అందరికీ శకునం చెప్పే బల్లి కుడితిలో పడ్డట్టు లేదూ!' అంటూ విజయసాయిరెడ్డి మండిపడ్డారు. అంతకు ముందు ట్వీట్‌లో 'ప్రజా మద్దతుతో 4 సీట్లు కూడా గెలవలేమని పచ్చ పార్టీ ఫిక్సయింది. అందుకే నిమ్మగడ్డ యాప్. ఎలక్షన్ కమిషన్ యాప్ ఉండగా ఈ సీక్రెట్ యాప్ ఏంటి? దీని కంట్రోల్ రూం టీడీపీ ఆఫీసులో పెట్టారా? చంద్రబాబును, చినబాబును నువ్వు జాకీలేసినా లేపలేవు నిమ్మగడ్డా?' అంటూ విజయసాయిరెడ్డి ÷ర్ అయ్యారు.

# డిజిటల్ చెల్లింపుల కోసం రూ.1,500 కోట్ల ప్రోత్సాహక నిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి1: నగదు రహిత చెల్లింపు విధానాలను మరింత అనుమతించడానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ.1500 కోట్ల విలువైన ప్రోత్సాహక నిధులను ప్రకటించారు. డిజిటల్ లావాదేవీలను మరింత పెంచడానికి, డిజిటల్ చెల్లింపు పద్ధతులను ప్రోత్సహించడానికి రూ.1,500 కోట్ల నిధులు కేటాయించానని నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. అయితే ఆ నిధులను డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహానికి ఎలా వినియోగిస్తారో మంత్రి వెల్లడించలేదు. కాగా, డిజిటల్ చెల్లింపులను విస్తరించాలనే లక్ష్యంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కూడా రూ.345 కోట్లతో పేమెంట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (పీఐడీఎఫ్)ను ఏర్పాటు చేసింది.

# భారత ఆశాజ్యోతి కల్పనా చావ్లా

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): అంతరిక్షంలో పరిశోధనలు ముమ్మరం అవుతున్న వేళ కల్పనా చావ్లా అకాల మరణం పరిశోధనా రంగానికి తీరని లోటుగా భావించాలి. ఆమె అంతరిక్షం నుంచి తిరుగు ప్రయాణమైన సందర్భంలో ప్రమాదంలో మరణించడం యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. కొలంబియా వ్యోమనౌకకు 2003 ఫిబ్రవరి 1లో విపత్తు జరిగింది. భూమికి తిరిగి వస్తున్న క్రమంలో అది ప్రమాదానికి గురయ్యింది. ఈ ప్రమాంతోల చనిపోయిన ఏడుగురి బృందంలో ఈమె కూడా ఒకరు. చావ్లా పోయింతర్వాత పంజాబ్ ఇంజనీరింగ్ కాలేజీ లోని ఆడపిల్లల హాస్టల్ కు కల్పనా చావ్లా అని పేరు పెట్టారు. 1997 లో కల్పనా చావ్లా అంతరిక్ష యానం చేసిన మొదటి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించారు. అప్పుడీమే 376 గంటల పాటు అంతరిక్షంలో గడిపారు. భూమి చుట్టూ 252 సార్లు పరిభ్రమించి 6.5 మిలియన్ మైళ్ళు అంతరిక్ష యానం చేశారు. 2003, జనవరి 16 న రెండోసారి అంతరిక్షం లోకి వెళ్ళే ముందు కల్పనా చావ్లా విలేకరులతో మాట్లాడారు. 'భారతదేశంలో మొట్టమొదటి విమానాన్ని నడిపిన జె.ఆర్.డి.టాటా యే నాకు స్ఫూర్తి, అందుకనే ఏరోనాటిక్స్ ఇంజనీరింగ్‌ను కెరీర్ గా తీసుకున్నానని చెప్పారు.వ్యోమగామిగా ఎంపికైన తర్వాత శిక్షణలో భాగంగా ఆమె ఎంత కష్టమైన పనినైనా దీక్షతో చేశారు. వ్యోమగాములందరూ కొండ ఎక్కుతున్నారు.

వెంట తెచ్చుకున్న బరువూ మోయలేక ఒక్కొక్కరు వాటిని వదిలివేస్తూ ఉంటే ఆ వెనకే వస్తున్న కల్పన వాటిని మోసుకొచ్చేవారు. సహచర వ్యోమగాములు వారించిన తర్వాతే వాటిని వదిలి వేసేవారు. శారీరక శ్రమ విషయంలో పురుషుల కంటే తాను తక్కువ కాదని నిరూపించుకున్నారు. కల్పన ఒక శక్తిగా ఎదిగారు. కనుకే 1988లో నాసా లోని రీసెర్చి సెంటర్‌లో సైంటిస్ట్‌గా చేరిన కల్పన అయిదేళ్ళకే ఎన్నో పరిశోధనలు చేసి కాలిఫోర్నియా ఓవర్ సెట్ మెథడ్స్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైనారు. 1995 లో నాసా వ్యోమగామి అభ్యర్థిగా ప్రకటించింది. 15 మంది వ్యోమగాములు కలసి కల్పన అంతరిక్షంలోకి వెళ్ళేందుకు మూడేళ్ళపాటు శిక్షణ తీసుకున్నారు. 1997 లో ఎస్‌టిఎస్ – 87 లో అంతరిక్షం పైకి వెళ్ళారు. 1997, నవంబరు 19 న మిషన్ స్పెషలిస్టుగా ఆరుగురు సభ్యులు గల చోదక సిబ్బందిలో ఒకరుగా 4 వ యు.ఎస్.మైక్రో గ్రావిటీ పేలోడ్ ఫ్లైట్ లో కొలంబియా 'ఎస్‌టిఎస్ –87' మీద అంతరిక్షయానం చేసి సూర్యుని వెలుపలి వాతావరణాన్ని అధ్యయనం చేశారు. రెండవసారి అంతరిక్ష యానాన్ని చేసే అవకాశం కూడా ఆమెకు లభించింది. 2003, జనవరి 16 న ఎస్‌టిఎస్–107 కొలంబియా స్పేస్ షటిల్ లో 16 రోజుల అంతరిక్ష పరిశోధనకు అంతరిక్షంలోకి వెళ్లడానికి నిర్ణయం జరిగింది. కల్పనా చావ్లా భారత దేశంలోని హర్యానా రాష్ట్రంలోని కర్నాల్ పట్టణంలో 1962 మార్చి 17న జన్మించింది. సునీత, దీప, సంజయ్‌ల తర్వాత



## నేడు ఆమె వర్ధంత సందర్భంగా..

ఈమె జన్మించారు. ఇంట్లో అందరూ ముద్దుగా 'మోంటు' అని పిలుచుకొనే కల్పనా చావ్లా కులీన కుటుంబంలో పుట్టలేదు. తండ్రి బనారసీలాల్ చావ్లా సాధారణ వ్యాపారి. కల్పనపై ఆయన ప్రభావం ఎక్కువ. పేదరికం నుంచే ఆయన పైకెదిగారు. పట్టుదల, అందుకు తగిన కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన వ్యక్తి ఆయన. చిన్నగా టైర్ల వ్యాపారాన్ని ప్రారంభించిన ఆయన తొలుత ఎన్నో కష్టనష్టాలకు గురయ్యారు. అయినా దాన్ని వదలకుండా అనుకున్నది సాధించేందుకు ముందుకు సాగిపోయారు. అప్పటి వరకూ టైర్ల తయారీకి విదేశీ యంత్రాన్ని ఉపయోగించే వారు. ఆ క్రమంలో ఆయన దేశీయంగానే ఆ యంత్రాన్ని రూపొందించారు. బనారసీలాల్ శ్రమ ఫలించింది. రాష్ట్రపతి నుంచీ అభినందనలు అందుకున్నారు. తర్వాత డబ్బుకోసం బనారసీ కుటుంబం ఇబ్బంది పడింది లేదు. ఆడపిల్లే అయినా జీవితంలో ఏదో సాధించాలన్న తపన కల్పనలో పాదుకోవడానికి తండ్రేకారణం. 'పరిస్థితులు ఎలాగున్నా... కన్న కలల్ని నిజం చేసుకోవడమే అంతిమ లక్ష్యం అన్న మాటలు నా తండ్రి జీవితంలో నిజమయ్యాయి. ఫలితంగా అవే నాలోనూ జీర్ణించుకుకుపోయాయి. అందుకు నాన్నే కారణం. అంటూ తొలి అంతరిక్షయానం తర్వాత ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఆలోచనలు ఏ విధంగా ప్రభావితమయిందీ కల్పన వివరించారు.

# పెట్రోల్‌పై బాదుడే బాదుడు

## మరింతగా పెరగనున్న ధరలు

## సామాన్యులకు భారంగా సెస్సులు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): బడ్జెట్‌లో ఊరట కోసం చూస్తున్న సామాన్యుల నడ్డి విరిచింది కేంద్ర ప్రభుత్వం. ఇప్పటికే భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలపై సెస్ పేరుతో మరింత భారం వేసింది. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్ పేరుతో పెట్రోల్‌పై రూ.2.5, డీజిల్‌పై రూ.4 సెస్ విధించారు. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు మరింత పెరగనున్నాయి. బండి రోడ్డెక్కాలంటే తప్పనిసరైన పెట్రోల్, డీజిల్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన ఆదాయ వనరుగా మార్చేసుకుంటోంది. అనేక దేశాల్లో అతి తక్కువ ధర పలుకుతున్న పెట్రోడీజిల్ లు మనదేశంలో ప్రత్యేకంగా ఏపీలో అత్యధిక ధరకు చేరుకుంటున్నాయి. పెట్రోల్ ధరలు ఏపీలో 92 రూపాయలు దాటేయగా డీజిల్ ధర 85 రూపాయలు దాటేసింది. రానున్న రోజుల్లో ఈ ధరలు సెంచరీ కొట్టినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదంటున్నారు డీలర్లు, వినియోగదారులు. రోజుల వ్యవధిలో పెరుగుతున్న పెట్రోల్ ధరలు వినియోగదారులను ఆందోళనలకు గురిచేస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు బ్యారెక్ ధర చాలా తక్కువ దేశంలోకి వస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న వివిధ రకాల పన్నుల కారణంగా అది మోత మోగిపోతోంది. ఒకసారి ధరలను పరిశీలిస్తే ఆ విషయం మనకు స్పష్టంగా అర్థమవుతుంది. ఏపీలో పెట్రోల్ ధర 92.42 రూపాయలు ఉండగా, డీజిల్ 85.62 రూపాయలు ఉంది. తాజా సెస్ విధింపుతో మరింతగా పెరిగే అవకాశం ఉంది. పెట్రోల్ బేసిక్ ధర – 27.75 రూపాయలు కాగా కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ – 32.98 రూపాయలు విధిస్తోంది. ఇక డీలర్ కమిషన్ – 3.67 రూపాయలు కాగా ఆయిల్ కంపెనీ ఛార్జీలు – 3 రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ 31 శాతంగా ఉంది. దీనికి తోడు లీటరుకు 4 రూపాయలు అడిషినల్ సెస్ విధిస్తున్నారు. రోడ్ల బాగుకి లీటరుకు రూపాయి ..ఈ రూపాయిపై 31 శాతం వ్యాట్ కూడా వేస్తారు.

వీటికి ట్రావెల్ ఛార్జి కలిపి మొత్తం – 92.42 పైసలు అవుతుంది. లీటరుకు రాష్ట్ర ప్రభుత్వానికి పెట్రోల్ నుంచి 25 రూపాయలు ఆదాయం వస్తుంది. ఇక డీజిల్ బేసిక్ ధర – 28.66 రూపాయలు మాత్రమే. కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ – 31.83 రూపాయలు వడ్డిస్తోంది. డీలర్ కమిషన్ – 2.53 రూపాయలు, ఆయిల్ కంపెనీ ఛార్జిలు – 3 రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ 22.25 శాతం విధిస్తోంది. లీటరుకు 4 రూపాయలు అడిషినల్ సెస్‌రోడ్ల బాగుకి లీటరుకు రూపాయి కాకుండా 22.25 శాతం వ్యాట్ వేస్తున్నారు. వీటికి ట్రావెల్ ఛార్జి కలిపి 85.62 రూపాయలు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ కూడా గత ఆరేళ్ళలో దారుణంగా పెంచింది. దీన్ని ఆయిల్ కంపెనీల డీలర్లు సైతం చెబుతున్నారు. 2014కి ముందు కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ డీజిల్ పై లీటరుకి 3.40 రూపాయలు ఉండగా, పెట్రోల్ మీద 9.60 రూపాయలు ఉండేది. ఈ ఆరేళ్ళ కాలంలో అది 30 రూపాయలను దాటేసింది. ఇది కూడా పెట్రో ధరలు ఆకాశాన్ని తాకటానికి ఓ కారణంగా మారాయి. పెట్రో, డీజిల్ బ్యారెల్ ధరలు ఒకే విధంగా ఉన్నప్పటికీ ఆయా రాష్ట్రాల పన్నులు వేరే విధంగా ఉండటంతో రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య కూడా పెట్రో ధరల్లో తేడాలు ఉంటున్నాయి. పక్కపక్క రాష్ట్రాల్లో ధరలు తక్కువగా ఉండటంతో సరిహద్దుల్లో ఉన్న పెట్రోలు బంకులు బోర్డులు పెట్టి మరీ అమ్మకాలు చేస్తున్నాయి. ప్రధానంగా ఏపీ, టీఎస్ సరిహద్దుల్లో ఉన్న బంకుల్లో ఇలాంటి బోర్డులు ఎక్కువగా దర్శనమిస్తాయి. తెలంగాణలో కంటే ఏపీలో పెట్రోల్ 2.60 రూపాయలు ఎక్కువ ఉండగా, డీజిల్ 2.80 వరకు ఎక్కువ ఉంది. ఏపీ పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సాలలో ఏపీలో కంటే పెట్రోలు డీజిల్ ధరలు తక్కువగా ఉంటున్నాయి. తాజా సెస్‌తో మరింత పెరుగుతుందని ఆందోళన కలుగుతోంది.

# ట్రాక్టర్ల ర్యాలీ తరవాత కనిపించకుండా పోయిన 100 మంది

## ఆచూకీ కోసం కమిటీ ఏర్పాటు చేసిన కిసాన్ మోర్చా

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): గణతంత్ర దినోత్సవం రోజు దేశ రాజధానిలో జరిగిన ట్రాక్టర్ల ర్యాలీ అనంతరం కనిపించకుండా పోయిన దాదావు 100 మంది ఆచూకీ తెలుసుకునేందుకు 'సంయుక్త కిసాన్ మోర్చా' ఆధ్వర్యంలో ఆరుగురితో ఒక కమిటీ ఏర్పాటైంది. వీరి గురించి సమాచారాన్ని సేకరించి తగిన చర్య కోసం అధికార వర్గాలకు అందజేసే పనిని ఈ కమిటీ చూస్తుంది. గల్లంతైనవారి గురించి 81980 22033 నంబరు ద్వారా ఎవరైనా సమాచారాన్ని తెలియవరచవచ్చని కిసాన్‌మోర్చా ఒక ప్రకటనలో తెలిపింది. ఆచూకీ తెలుసుకోవడంలో చట్టపరంగా సాయం చేయడానికి అన్ని చర్యలూ తీసుకుంటామని శిరోమణి అకాలీదళ్ అధినేత బాదల్ చెప్పారు. కేసుల్ని ఉచితంగా వాదించేందుకు అన్ని జిల్లాల్లో న్యాయవాదులను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఢిల్లీ సరిహద్దుల్లో వివిధ చోట్ల అంతర్జాల సేవలను నిలుపు చేయడంపై రైతు నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఇది అన్యాయం, అప్రజాస్వామికమని ఖండించారు. మహారాష్ట్రకు చెందిన షాయ్‌రా పవారా (21) అనే యువతి శహరన్‌పున్‌లో ఆందోళనలో పాల్గొని ఆదివారం చనిపోయినట్లు కిసాన్ మోర్చా తెలిపింది. ఢిల్లీ సరిహద్దులోని సింఘు వద్దకు ఆదివారం పంజాబ్–హరియాణాల నుంచి రైతులు వెల్లువెత్తారు. మరిన్ని వేల మంది అక్కడకు రాబోతున్నారని సత్నామ్‌సింగ్ సాహ్ని అనే రైతు నేత తెలిపారు. తాగునీరు, ఆహారం, ఇంటర్నెట్ వంటివి తమకు అందకుండా చేస్తున్నారని కొందరు రైతులు ఆరోపించారు. అయినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టంచేస్తున్నారు. ట్రాక్టర్ల ర్యాలీలో హింసకు సంబంధించి దిల్లీ పోలీసులు తాజాగా కొందరు రైతు నేతలు సహా 50 మందికి నోటీసులు పంపించారు. దీంతో ఇలా నోటీసులు అందుకున్నవారి సంఖ్య 94కి చేరింది. హింసలో కనిపించిన ట్రాక్టర్లను గుర్తించి, వాటి యజమానులకూ నోటీసులు పంపిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కొత్త సాగు చట్టాలు అనేక నష్టాలను రాజేసే అగ్గి లాంటివని, వీటిని రద్దు చేయాలని భారతీయ కిసాన్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు నరేశ్ టికాయిత్ మరోమారు డిమాండ్ చేశారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి నష్టమేమీ ఉండదు. మీ పొరపాటును అంగీకరించి చర్చలు జరపండి. వేం పెద్దగా చదువుకోలేకపోవచ్చు.. కానీ సమాజం ఏ దిశగా వెళుతుందో మాకు తెలుసు. భాజపా రాజకీయాలు చేయడం లేదా? రైతులు మౌనంగా ఉండాలా? అది జరగదు. రైతులు బలహీనపడినట్లు భావించొద్దు. ఇక ఏటా ఒకటి రెండు రాష్ట్రాల్లో ఎన్నికలుంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకోండని అన్నారు.

# భారీగా బంగారు ఆభరణాలు, వజ్రాలు స్వాధీనం

అమరావతి, ఫిబ్రవరి 1 : అంతరాష్ట్ర సరిహద్దు పంచలింగాల చెక్ పోస్టులో భారీగా బంగారు ఆభరణాలు, వజ్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్‌లో వీటి విలువ రూ. 2 కోట్ల 30 లక్షలుగా సమాచారం. ఎటువంటి పన్ను చెల్లింపు బిల్లులు లేకుండా తరలిస్తున్న 3.79 కేజీల బంగారం, 435 క్యారెట్లు గల వజ్రాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఓ కారును సీజ్ చేశారు. కర్నూలు జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి చెక్‌పోస్టులో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్న సీఐ లక్ష్మీదుర్గయ్య, ఇతర పోలీసు సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

గ్రామ పంచాయితీ ఎన్నికల సంధర్బంగా సరిహద్దు పంచలింగాల చెక్ పోస్టు వద్ద కర్నూలు తాలుకా పోలీసులు మరియు స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టి) తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుండి సేలం వెళ్తున్న కారును ఆపి క్షుణ్ణంగా తనిఖీలు చేయగా భారీగా బంగారు ఆభరణాలు, వజ్రాలు వెలుగుచూశాయి. వీటికి సంబంధించి సరైన బిల్లు(వత్రాలు)లు, ఆధారాలు లేకపోవడంతో ఎలక్షన్ ప్రొసిజర్ ప్రకారం వీటిని స్వాధీనం చేసుకున్నారు.

హైదరాబాద్ బోయినపల్లికి చెందిన విజయ్ శర్మ, రంగారెడ్డి జిల్లా



సరూర్‌నగర్‌కు చెందిన సురేష్ మునిస్వామి ఇరువురు కలిసి హైదరాబాద్ నుండి సేలంకు కారులో వెళ్తున్నారు. ఈ ఆభరణాలను హైదరాబాద్ ఆర్‌బిఆర్ అను బంగారు వ్యాపారనంస్థ నుండి తరలిస్తున్నారు. ఇందులో రింగ్స్– 61, నెక్లెస్ సెట్–09, పెండెట్ సెట్–01, ఓస్లీ పెండెంట్–24, ఇయర్ రింగ్–06, జిమ్కిలు?06, లేడీస్ టాప్స్–13, ఓస్లీ నెక్లెస్‌లు– 27, లేడీస్ బ్రాస్ లేట్– 23, మొత్తం 170 ఐటమ్స్ ఉన్నాయి.

ఈ విషయంపై కర్నూలు తాలుకా పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక, తెలంగాణ నుండి అక్రమరవాణా మద్యం, నగదు అరికట్టుటుకు 10 ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు, 5 అంతర్ జిల్లా చెక్ పోస్టులు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసి ఎన్నికల నేపథ్యంలో సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

# పేదలకు నగదు బదిలీ ప్రస్తావన లేదు : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. బడ్జెట్‌లో పేదలకు ఊతమిచ్చేలా నగదు బదిలీల ప్రస్తావనే లేదని దుయ్యబట్టారు. దేశ సంపదను కొద్దిమంది పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

బడ్జెట్‌ను స్వాగతించిన జేపీ నడ్డా

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ 2021ను బీజేపీ చీఫ్ జేపీ నడ్డా స్వాగతించారు. బడ్జెట్ సమ్మిళిత వృద్ధికి సంకేతంలా ఉదని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడిందని నడ్డా ప్రశంసించారు. నిర్మలా సీతారామన్ రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారనే విపక్షాల విమర్శలను ఆయన తోసిపుచ్చారు. సంక్లిష్ట సమయంలో వచ్చిన ఈ బడ్జెట్ సమ్మిళిత వృద్ధికి దోహదపడుతుందని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పునరంకితమయ్యేలా ఉందని నడ్డా ప్రశంసలు గుప్పించారు.

# సెస్‌తో పెరగనున్న ధరలు

## లిక్కర్ ధరలకు రెక్కలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టినబడ్జెట్‌లో ప్రతి ఒక్కరిని కలవరపెడుతున్న అంశం సెస్. ఇక మీదట క్రూడ్ ఆయిల్, ఆల్కహాల్, ముడి ఆయిల్, కొన్ని దిగుమతి చేసుకునే వస్తువులపై వ్యవసాయ, మౌలికసదుపాయల అభివృద్ధి సెస్‌ని విధించేందుకు కేంద్రం సిద్ధమయ్యింది. ఈ నేపథ్యంలో ఆల్కాహాల్, క్రూడ్ ఆయిల్, పామయిల్, వంట నూనెల ధరలు భారీగా పెరగనున్నాయి. ఆల్కాహాల్ బివరేజేస్‌పై కేంద్రం 100 శాతం సెస్‌ని ప్రతిపాదించింది. దాంతో మందు బాబుల కళ్లు బైర్లు కమ్మేలా మద్యం ధరలు మరింత పెరగనున్నాయి. ముడి పామాయిల్‌పై 17.5 శాతం, దిగుమతి చేసుకున్న యాపిల్స్‌పై 35 శాతం, ముడి సోయాబీన్, సన్ ఫ్లవర్ నూనెలపై 20శాతం వ్యవసాయ సెస్‌ని బ్జడెట్‌లో ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఫలితంగా వంట నూనెలు ధరలు మరింత పెరగనున్నాయి. ఇప్పటికే వంట నూనెలు లీటర్ 140 రూపాయలుగా ఉండగా.. వ్యవసాయ సెస్ అమల్లోకి వస్తే.. ఇది మరింత పెరగనుంది. ఇక పెట్రోల్, డీజిల్‌పై విధించిన వ్యవసాయ సెస్‌ని సుంకం నుంచి మినహాయిస్తామని.. ఫలితంగా వాటి ధరలు యథాతథంగా ఉంటాయిన నిర్మలా సీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# సోషల్ మీడియా వేదికగా బడ్జెట్ చర్చ

## భారీగా స్పందించిన నెటిజన్లు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): : కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం ప్రారంభించిన అనంతరమే సోషల్ మీడియాలో బడ్జెట్ పై చర్చ ప్రారంభమైంది. కేంద్ర మంత్రి ఒక్కో కేటాయింపు గురించి ప్రకటిస్తూ ఉంటే నెటిజెన్లు పెద్ద ఎత్తున చర్చ చేస్తూ వచ్చారు. ఈ చర్చ ఎంతలా జరిగిందంటే.. 'బడ్జెట్ 2021' అనే హ్యాష్‌ట్యాగ్‌పై ఇప్పటి వరకు ఏకంగా 13 లక్షల ట్వీట్లు వచ్చాయి. ట్విట్టర్‌తో పాటు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి పబ్లిక్ వేదికల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ఈసారి బడ్జెట్ ప్రసంగాన్ని సోషల్ మీడియాలో లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేశారు. సోషల్ మీడియాలో ఇంత పెద్ద ఎత్తున చర్చ జరగడానికి కారణం అదొకటని అంటున్నారు. అంతే కాకుండా డిజిటల్ విధానం నానాటికీ అభివృద్ధి చెందుతుండడం, సోషల్ మీడియా యూజర్లతో పాటు వాడకంలోనూ అనేక మార్పులు రావడంతో ఈ వేదికలపై చర్చలు పెరిగాయి. ఈ తరుణంలో తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పెద్ద ఎత్తున చర్చ చేస్తున్నారు.

# తృణమూల్‌కు మరో దెబ్బ

## రాజీనామా చేస్తానన్న ఎమ్మెల్యే దీపక్ హల్దార్

కోల్‌కతా,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): తృణమూల్ కాంగ్రెస్‌కు ఝలక్ తగులుతూనే ఉంది. డైమండ్ హార్బర్ ఎమ్మెల్యే దీపక్ హల్దార్ సోమవారం సంచలన ప్రకటన చేశారు. పేదల ప్రజల కోసం పనిచేస్తామంటే పార్టీ మోకాలడ్డుతోందని మండిపడ్డారు. ఈ కారణంగానే తాను పార్టీ నుంచి త్వరలోనే వైదొలుగుతానని ప్రకటించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందాను. కానీ 2017 నుంచి పేద ప్రజల కోసం

పనిచేయలేకపోయా. ఇప్పటికే అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లా. అయినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నా నియోజకవర్గ ప్రజలకు నేను జవాబుదారీ. అందుకే పార్టీ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా. తొందర్లోనే అధిష్ఠానానికి రాజీనామా లేఖ పంపుతా.' అని దీపక్ హల్దార్ ప్రకటించారు. అయితే బీజేపీలో చేరతారా? అన్న ప్రశ్నకు మాత్రం ఆయన స్పందించలేదు.

# 250 ట్విట్టర్ అకౌంట్లు మూత.. ఎందుకంటే..?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి1: దేశవ్యాప్తంగా దాదాపు 250 అకౌంట్లను ట్విట్టర్ సంస్థ సోమవారం బ్లాక్ చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ట్విట్టర్ సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నది. తప్పుడు సమాచారం పోస్ట్ చేయడంతోపాటు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్న పలువురి ట్విట్టర్ ఖాతాలపై చర్యలు తీసుకోవాలంటూ గత వారం ట్విట్టర్ సంస్థకు కేంద్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఈ మేరకు దాదాపు 250 అకౌంట్లను బ్లాక్ చేసినట్లు సమాచారం. ప్రసారభారతి సీఈఓతో పాటు పలువురు ప్రముఖ వ్యక్తులకు చెందిన ట్విట్టర్ ఖాతాలను మూసివేస్తున్నట్లు ట్విట్టర్ ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు ఈ చర్య తీసుకున్నట్లుగా తెలుస్తున్నది. "భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడటానికి పారదర్శకత చాలా ముఖ్యమైనది. కావున, నిలిపివేయబడిన కంటెంట్ కోసం మాకు నోటీసు విధానం ఉన్నది. కంటెంట్‌ను నిలిపివేయమని అభ్యర్థనలు అందిన అనంతరం ప్రభావిత ఖాతాదారులకు సమాచారాన్ని వెంటనే తెలియజేసాం" అని తన ప్రకటనలో తెలిపింది.

'#ModiPlanningFarmerGenocide' హ్యాష్‌ట్యాగ్‌ను ఉపయోగిస్తున్న, జనవరి 30 న నకిలీ, బెదిరింపు, రెచ్చగొట్టే ట్వీట్లు చేస్తున్న దాదాపు 250 ట్వీట్లు / ట్విట్టర్ ఖాతాలను బ్లాక్ చేయాలంటూ కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ.. ట్విట్టర్‌ను ఆదేశించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మారణహోమం సృష్టించేలా ప్రజలను రెచ్చగొడుతున్నందున ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్, సెక్షన్ 69 ఏ కింద ఆయా ట్విట్టర్ ఖాతాలను, ట్వీట్లను బ్లాక్ చేయమని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. దేశ రాజధాని సరిహద్దుల్లో కొనసాగుతున్న రైతుల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని దేశంలో శాంతిభద్రతల సమస్యలు పెరుగకుండా నిరోధించాలని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖతోపాటు వివిధ చట్ట అమలు సంస్థల అభ్యర్థనను అనుసరించి ట్విట్టర్ సంస్థ ఈ ఖాతాలను బ్లాక్ చేసింది.

# భారీగా తగ్గిన పసిడి ధర.. పెరిగిన వెండి ధర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి1:: దేశంలో పసిడి ధర భారీగా తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 99.9 స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.1,324 తగ్గి రూ.47,520కి చేరింది. క్రితం ట్రేడ్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.48,844 వద్ద ముగిసింది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో బంగారం, వెండి దిగుమతులపై దిగుమతి సుంకాన్ని తగ్గించిందని, ఇవాళ్టి ట్రేడింగ్‌లో బంగారం ధర భారీగా తగ్గడానికి అది కూడా ఒక కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ నిపుణులు తెలిపారు. అయితే, బంగారం ధర తగ్గినా దేశంలో ఇవాళ్టి ట్రేడింగ్‌లో వెండి ధర మాత్రం భారీగా పెరిగింది. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.3,461 పెరిగి రూ.72,470కి చేరింది. క్రితం ట్రేడ్‌లో కిలో వెండి ధర రూ.69,009 వద్ద ముగిసింది. కాగా, అంతర్జాతీయ మార్కెట్‌లో ఇవాళ ఔన్స్ బంగారం ధర 1,871 అమెరికన్ డాలర్లు, ఔన్స్ వెండి ధర రూ.29.88 అమెరికన్ డాలర్లు పలికింది.

# మంచి నీటి వనరులే మానవాళి ఆవాస తీరాలు

**(02 ఫిబ్రవరి 'ప్రపంచ చిత్తడి నేల దినం' సందర్భంగా)**

నీరు నిలువ ఉండే ప్రదేశాలను చిత్తడి నేలలు లేదా వెట్‌ల్యాండ్‌లు అంటాం. ప్రపంచ మానవాళికి మరియు భూగోళానికి విడదీయరాని సంబంధం ఉంది. చిత్తడి నేలల పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల రక్షణ, నీటి కొరతను తగ్గించడం, జీవజాతులకు తాగు నీరు అందించడం, వ్యవసాయానికి సాగునీరు, భూగర్భ జలాలను పెంచడం లాంటి ముఖ్యమైన ప్రయోజనాలు కలిగిన చిత్తడి నేలలను కాపాడుకోవలసి అవసరాన్ని గుర్తు చేయటానికి ఐరాస నాయకత్వంలో ప్రతియేటా 02 ఫిబ్రవరి రోజున 'ప్రపంచ చిత్తడి నేల దినం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ప్రపంచ చిత్తడి నేల దినం–2021 వేదికగా 'వెట్‌లాండ్స్ అండ్ వాటర్' అనే నినాదం తీసుకొని 'వరల్డ్ వెట్‌లాండ్ డే' పాటించుట జరుగుతోంది. ప్రపంచం ఎదుర్కొంటున్న నీటి సంక్షోభాన్ని అధిగమించడానికి చిత్తడి నేలలను కాపాడుకోవలసిన అగత్యం ఏర్పడింది. నేలకు, నీటికి, జీవులకు అవినాభావ సంబంధం ఉంది. వీటి మధ్య సమతుల్యత లోపిస్తే భూగోళంపై పర్యావరణ ఆరోగ్యం విచ్ఛిన్నం అవుతుంది. చిత్తడి నేలల్లో అధికశాతం మంచి నీటి నిల్వలు ఉంటాయి. మంచి నీటి నాణ్యత మరియు లభ్యత పట్ల సామాన్య జనులకు అవగాహన అవసరం ఉంది. వెట్‌లాండ్ ప్రయోజనాల్లో పరిశుద్ధ మంచి నీటి లభ్యత, నీటి కొరత తీరడం, జీవావరణ రక్షణ, జీవనోపాధి కల్పన, జీవవైవిధ్య పరిరక్షణ, తుఫానుల అదుపు, కార్బన్ నిల్వలు, వాతావరణ మార్పులు, ఆరోగ్య పరిరక్షణ, పర్యాటకాభివృద్ధి, జలచరాల పోషణ లాంటివి వస్తాయి.

02 ఫిబ్రవరి 1971న ఇరాన్‌లో జరిగిన (నేటికి 50 ఏండ్లు పూర్తి) చిత్తడి నేలల అంశంతో రామ్సర్ సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ 'రామ్సర్ సదస్సు'కు గుర్తుగా ప్రపంచ వెట్‌లాండ్ దినాన్ని 02 ఫిబ్రవరి రోజున నిర్వహించుట జరుగుతోంది. నీటితో నిండి ఉన్న చిత్తడి నేలల్లో చెరువులు, సరస్సులు, నదులు, కుంటలు, పల్లెలు, వరద మైదానాలు, తడి నేలలు, తీరప్రాంత చిత్తడి నేలలు, మడ అడవులు, చేపల చెరువులు, వరి మడులు, మడుగులు, మానవ నిర్మిత నీటి నిలువలు లాంటివి వస్తాయి. చిత్తడి నేలల పరిరక్షణ పట్ల అవగాహన, సమావేశాలు, వెబినార్లు, ప్రదర్శనలు, జనావాసాల్లో వెట్‌లాండ్ అంశంతో పరుగు/నడక/బైక్ ర్యాలీలు, చిత్తడి నేలలను శుద్ధి చేయడం, ఫోటో ప్రదర్శనలు, వ్యాసరచన/ఉపన్యాస/క్విజ్ పోటీలు, ప్రచార మాధ్యమాల ద్వారా నిపుణులతో ప్రసంగాలు, క్రరపత్రాల ముద్రణ, బ్యానర్ల ఏర్పాటు లాంటి పలు కార్యక్రమాలను ఈ రోజున నిర్వహించాలి.

ప్రపంచవ్యాప్తంగా 1900 నుండి నేటికి చిత్తడి నేలలు సగానికి పైగా అంతరించి పోవడం విచారకరం. జీవ జాతుల్లో 40 శాతం వరకు వెట్‌లాండ్‌లల్లోనే జీవిస్తాయి. చిత్తడి నేలలతోనే మానవాళికి మంచి నీరు లభిస్తుంది. ఇండియాలో 4.7 శాతం భూభాగం చిత్తడి నేలలతో నిండి ఉంది. పట్టణీకరణ పెరిగిన కొద్దీ చిత్తడి నేలల వైశాల్యం తగ్గుతోంది. వీటిని కాపాడటానికి పటిష్ట వ్యవస్థ లేక పోవడం గర్హనీయం. రామ్సర్ సదస్సుతో ప్రారంభమైన చిత్తడి నేలల పరిరక్షణ ఉద్యమంలో భాగంగా వివిధ దేశాలలో ఉన్న ముఖ్యమైన చిత్తడి నేలల సరస్సులను 'రామ్సర్ వెట్‌లాండ్ సరస్సులు'గా గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా 2,400 రామ్సర్ సరస్సులు (2.5 మిలియన్ ఘనపు కిమీ ఘనపరిమాణం) ఉండగా, భారత్‌లో డిసెంబర్ 2020 నాటికి 42 రామ్సర్ వెట్‌లాండ్ సరస్సులను గుర్తించారు. యూకేలో అత్యధికంగా 175, మెక్సికోలో 142 రామ్సర్ సరస్సులు ఉన్నాయి. భారతదేశ యూపీలో అత్యధికంగా 8 రామ్సర్ సరస్సులు మరియు పంజాబ్‌లో 6 సరస్సులు ఉన్నాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్‌లోని కొల్లేరు సదస్సు కూడా జాబితాలో చోటు దక్కించుకోవడం హర్షదాయకం. రామ్సర్ వెట్‌లాండ్ ప్రదేశాల్లో అతి పెద్దదిగా చిలికా సరస్సు (ఒరిస్సా) మరియు అతి చిన్నదిగా రేణుక సరస్సు (హిమాచల్) గుర్తించబడినవి. నివాసయోగ్య భూగోళాన్ని కాపాడుకోవడానికి పర్యావరణ పరిరక్షణలో భాగంగా చిత్తడి నేలలో ముఖ్య భాగాలైన సరస్సులు, చెరువులు, కుంటలు లాంటి సహజ మంచి నీటి జలవనరులను కాపాడుకోవలసిన అవసరం అందరి మీదా ఉన్నది. జలంతోనే జీవనం. ఎండిన నేలలు జీవ వినాశకాలు అని మరువరాదు. నీటిని కాపాడుకుందాం, ప్రాణాలను నిలుపుకుందాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# పెరగనున్న మొబైల్ ధరలు

**ఎక్సైజ్ సుంకం పెంపుతో మరింత భారం**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ మొబైల్ ప్రియులకు షాకిచ్చింది. మొబైల్ విడిభాగాలపైన 2.5శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఆయా వస్తువులపై కస్టమ్స్ డ్యూటీ ఐదు నుంచి పది శాతం పెంచుతున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల ఫోన్లు, ఛార్జర్ల ధర 1 నుండి 2 శాతం వరకూ పెరగవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఛార్జర్లపై సుంకాన్ని 15 నుంచి 30 శాతానికి, మదర్‌బోర్డ్‌లపై సుంకాన్ని 10 నుంచి 20 శాతానికి, మొబైల్ తయారీలో వినియోగించే ఇతర పరికరాలపై కూడా సుంకాన్ని పెంచారు. మొబైల్ ఫోన్లకు ఇస్తున్న 10 శాతం సర్వీస్ వెల్ఫేర్ సెస్ మినహాయింపును కూడా ఈసారి రద్దు చేశారు. మొబైల్ ఫోన్‌లలో ఉపయోగించే లిథియం అయాన్ బ్యాటరీల తయారీకి అవసరమైన భాగాలు, ఉప భాగాలపై ఇప్పటివరకు ఎటువంటి పన్ను విధించలేదు. కానీ, ఇప్పుడు 2.5 శాతం సుంకాన్ని విధిస్తున్నట్లు పేర్కొన్నారు ఇదిలా ఉంటే.. దేశీయంగా ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, సెమీకండక్టర్ల తయారీని ప్రోత్సహించేందుకు ఓ కొత్త పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్టు కేంద్రం ప్రకటించింది. ప్రపంచ ఉత్పత్తి గొలుసులో భారత్‌ను భాగస్వామిగా చేసేందుకు , ఉద్యోగావకాశాలను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం తెలిపింది. మేకిన్ ఇండియా విధానంలో భాగంగానే మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, వాటి విడిభాగాలపై కస్టమ్స్ సుంకాల రేట్లలో పెరుగుదల ఉంటుంది. ఈ చర్య వల్ల దేశీయ ఉత్పత్తి సామర్థ్యం పెరగనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఐతే దిగుమతి సుంకంలో పెరుగుదల ప్రభావం వినియోగదారులపై అంతగా ఉండకపోవచ్చని.. దేశీయ మొబైల్ ఫోన్ మార్కెట్ 97 శాతం అవసరాలు స్థానిక ఉత్పత్తుల వల్లనే సరిపోతాయని కొందరు పరిశీలకులు అంటున్నారు.

# ఎమ్మెల్యే చల్లా ఇంటిపై దాడికి నిరసన

**బంద్ పిలుపుతో పరకాలలో మూసుకున్న వ్యాపార,వాణిజ్య సంస్థలు**

వరంగల్ రూరల్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): పరకాల బంద్ ప్రశాంతంగా కొనసాగుతున్నది. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఇంటిపై బీజేపీ కార్యకర్తల దాడికి నిరసనగా పరకాల పట్టణ బందుకు టీఆర్ఎస్ పిలుపునిచ్చింది. దీంతో ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నారు. ఉదయం నుంచే వ్యాపార, వాణిజ్య సంస్థలు, కార్యాలయాలు తెరచుకోలేదు. హన్మకొండలో ఎమ్మెల్యే ఇంటిపై దాడికి నిరసనగా పరకాల శాసనసభ నియోజకవర్గం పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో టీఆర్ఎస్ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ప్రతి మండల కేంద్రం, రహదారులపై కూడళ్ల వద్ద రాస్తారోకో చేశారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

పరకాలలో టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ధర్నాకు దిగారు. ఆదివారం రోజు పరకాల టీఆర్ఎస్ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఇంటిపై బీజేపీ శ్రేణుల దాడికి నిరసనగా ధర్నాకు దిగారు. ఎమ్మెల్యే ఇంటిపై దాడికి నిరసనగా పరకాల శాసనసభ నియోజకవర్గం పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో టీఆర్ఎస్ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ప్రతి మండల కేంద్రం, రహదారులపై, కూడళ్ల వద్ద రాస్తారోకో చేశారు. బీజేపీ నేతలు తమ ఎమ్మెల్యేకు క్షమాణ చెప్పాలని టీఆర్ఎస్ శ్రేణులు టైర్లు తగలబెట్టి ఆందోళన చేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పరకాల ఎమ్మెల్యే ఇంటిపై బీజేపీ కార్యకర్తలు ఆదివారం విచక్షణారహితంగా దాడికి తెగబడ్డారు. నిరసనల పేరుతో విధ్వంసం సృష్టించారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో బీజేపీ నేతలు.. పార్టీ కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే ఇంటికి చేరుకున్నారు. వ్యూహాత్మకంగా వెంట తెచ్చుకున్న రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలను గేటు బయట నుంచి చల్లా ఇంటిపైకి విసిరారు. ఇంటి అద్దాలు పగులగొట్టారు. ఆవరణలో ఉన్న కుర్చీలను ధ్వంసం చేశారు. విధ్వంసానికి పాల్పడుతున్న బీజేపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. దాదాపు 55 మందిని అదుపులోకి తీసుకుని సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో బీజేపీ వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ప్రధాన కార్యదర్శి సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితర ముఖ్యనేతలు ఉన్నారు. దాడి చేసినవారిపై సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేశారు. ఆదివారం ధర్మారెడ్డి తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామమందిర నిర్మాణం పేరుతో బీజేపీ నాయకులు తెలంగాణలోనే రూ.1000 కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. నిధుల లెక్కలు చూపే వరకు పోరాటం చేస్తామన్న ఆయన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై బీజేపీ నేతలు చల్లా ఇంటిపై దాడి చేయండంతో వరంగల్ జిల్లాలో టీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ వార్ ఏర్పడింది.

**ఎలాంటి నేర సంఘటనలైనా ఛేదిస్తాం**

# అన్నిస్థాయిల పోలీసుల్లో ఉన్న అంకితభావం, ఆత్మస్థైరం మా బలం

**–కరీంనగర్ పోలీస్ కమిషనర్**





కరీంనగర్. ఫిబ్రవరి 1 (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో జరిగే ఎలాంటినేర సంఘటనలనైనా తమకు అందుబాటులో ఉన్న టెక్నాలజీ, అన్నిస్థాయిలకు చెందిన అధికారుల్లో ఉన్న ఉత్సాహం, వారు ఏర్పరుచుకున్న ప్రత్యేక సమాచార వ్యవస్థలు ఇందుకు దోహదపడుతాయని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. ఎలాంటి నేరసంఘటన విషయంలోనైనా నిందితులను కొన్నిగంటల వ్యవధిల్లోనే గుర్తిస్తూ వారిని పట్టుకునేందుకు క్రైంబృందాల్లోని అన్నిస్థాయిలకు చెందిన అధికారులు, నేరాల ఛేదనపై ఆసక్తి ఉన్న వారి బృందాలుగా ఏర్పాటు చేసి ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు పంపిస్తుస్తూ పట్టుకుంటున్నామని తెలిపారు. నేరాల ఛేదనకు అవసరమైన టెక్నాలజీ కమిషనరేట్‌లో అందుబాటులో ఉందని, అన్నిస్థాయిలకు చెందిన అధికారుల్లో నేరాలను చేదిస్తామనే ఆత్మస్థైర్యం ఉందని, ఆస్ఫూర్తితో పోలీస్‌శాఖ ముందుకుసాగుతోందని చెప్పారు.

<u>క్రైంబృందాలు మరింత బలోపేతం</u>

కమిషనరేట్‌వ్యాప్తంగా క్రైంబృందాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. నేరాల ఛేదనపై ఆసక్తి ఉన్న వారికి ఈ బృందాల్లో అవకాశాలను కల్పించనున్నామని పేర్కొన్నారు. క్రైంబృందాల్లోని పోలీసులు నేరాల ఛేదనను ఒకఛాలెంజ్‌గా స్వీకరించి సఫలీకృతంకావాలన్నారు. వివిధ రకాల నేరాల్లో నిందితులను పట్టుకునేందుకు వారాల తరబడి కుటుంబాలకు దూరంగా ఉంటూ అక్కడి భాషప్రభావంతో కొన్నిరకాల ఇబ్బందులు తలెత్తున్నా మొక్కవోని ఆత్మస్థైర్యంతో కరడుగట్టిన నేరస్తులను పట్టుకుంటుండం విధినిర్వాహణ పట్ల వారికున్న చిత్తశుద్ధి,అంకితభావం అభినందించాల్సిన విషయమన్నారు.

నేరాల ఛేదనలో కొన్ని సంవత్సరాల నుండి నిలకడగా రాణిస్తున్న అన్నిస్థాయిలకు చెందిన అధికారులు ఇతర విభాగాలకు చెందిన పోలీసులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని తెలిపారు. నేరాల ఛేదనలో కీలకపాత్ర పోషిస్తున్న అధికారులకు వెంటనే శాఖాపరంగా రివార్డులను అందజేయడంతోపాటు ప్రతిష్టాత్మకంగా భావించే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే వివిధ రకాల పతకాల ఎంపికకోసం వారిపేర్లను ప్రతిపాదిస్తున్నామని వివరించారు. ఇటీవలకాలంలో అంతరాష్ట్ర ముఠాలు అకస్మాత్తుగా వచ్చి నేరసంఘటనలకు పాల్పడిన సంఘటనలు జరిగాయని, నిందితులను గుర్తించడం జరిగిందని, వారిని పట్టుకునేందుకు క్రైంబృందాలు ఇతర జిల్లాలు, రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాలలో గాలింపులను కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు.

<u>శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పటిష్ట చర్యలు</u>

కమిషనరేట్‌వ్యాప్తంగా ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం చర్యల్లో భాగంగా వివిధ రకాల ఘర్షణలు, ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్పడే చర్యలతోపాటు వివిధ రాజకీయపార్టీల కార్యకలాపాలపై కూడా దృష్టి కేంద్రీకరించి అనుమానితులను గుర్తించాలని చెప్పారు.

అనుమానితుల పేర్లను అధికారుల దృష్టికి తీసుకరావాలని సూచించారు. అనుమానితులను గుర్తించినట్లయితే ముందస్తు చర్యలు తీసుకునేందుకు దోహదపడుతుందని చెప్పారు. అన్నివర్గాలకు చెందిన ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవడం ద్వారా అనుమానితులను సులువుగా గుర్తించడం సాధ్యం అవుతుందని సూచించారు. కమిషనరేట్‌లోని అన్ని పోలీస్‌వాహనాల్లో అత్యాధునిక సాంకేతిక, రక్షణ నిమిత్తం వివిధ రకాల పరికరాలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. వివిధ పోలీస్‌స్టేషన్లతోపాటు కమిషనరేట్ కేంద్రంలో రేయింబవళ్ళు వివిధ విభాగాలకు చెందిన అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు ఎక్కడ ఏ సంఘటన జరిగినా నిమిషాల వ్యవధిలో చేరుకునేందుకు రేయింబవళ్ళు సిద్ధంగా ఉంచామని వివరించారు.కమిషనరేట్‌వ్యాప్తంగా రేయింబవళ్ళు ఆకస్మిక తనిఖీలు, పెట్రోలింగ్‌లను నిర్వహించాలని తెలిపారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో పెట్రోకార్ విభాగం, బ్లూకోల్ట్స్ విభాగాలు తనిఖీలు చేస్తున్న తీరును ప్రత్యేకంగా రాత్రి పర్యవేక్షణ విధులను నిర్వహించే అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. పరివర్తన చెందకుండా వివిధ రకాల నేరాల్లో తరచూ తలదూర్చేవారిని గుర్తించి, సదరు వ్యక్తులను సంబంధిత తహసిల్దార్ల ఎదుట బైండోవర్ చేయించాలని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కరుడుగట్టిన నేరస్థులపై పిడియాక్ట్‌ను అమలు చేస్తామని హెచ్చరించారు.

# రక్షణరంగానికి పెరిగిన కేటాయింపులు

**హర్షం వ్యక్తం చేసిన రాజ్‌నాథ్ సింగ్**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ):కేంద్ర బడ్జెట్‌లో అత్యధిక కేటాయింపులు ఎప్పుడు రక్షణ శాఖకే ఉంటాయి. తాజాగా 2021–22 ఆర్థిక సంవత్సరంలో కూడా రక్షణ శాఖకు భారీగా కేటాయింపులు వచ్చాయి. 15 ఏళ్లలో లేనట్టు ఈసారి కేటాయింపులు చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల తెలిపారు. మొత్తం రక్షణ రంగానికి రూ.4,78,195.62 కోట్లు కేటాయించారు. ఇందులో మూలధన వ్యయం రూ.1.35 లక్షల కోట్లు ఉంది. గతేడాదితో పోలిస్తే మూలధన వ్యయం 19 శాతం పెరగడం గమనార్హం. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం రక్షణ రంగానికి పెద్ద ఎత్తున నిధులు ఇచ్చింది. దీంతో సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేయడం.. సైన్యానికి అధునాతన ఆయుధాలు కల్పించడంతో వారికి సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ఈ నిధులు వెచ్చించనున్నారు. ఈ కేటాయింపులపై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ట్వీట్ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రక్షణ రంగానికి రూ.4.78 లక్షల కోట్ల కేటాయింపుతో పాటు మూలధన వ్యయం రూ.1.35 లక్షల కోట్లు ఇచ్చిన ప్రధానమంతి, ఆర్థిక మంత్రికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. 15 ఏళ్ల తర్వాత మూలధన వ్యయంలో 19 శాతం పెంపు జరిగిందని ట్విట్టర్‌లో రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. రక్షణ రంగానికి గతేడాది కేటాయింపులు పరిశీలిస్తే రూ.3.62 లక్షల కేటాయింపులు జరగ్గా ఈ ఆర్థిక సంవత్సరం రూ.4,78,195.62 కోట్లు కేటాయించారు. గతేడాదితో పోలిస్తే 7.4 శాతం పెరిగింది. ఇక ఆయుధాల కొనుగోలు, మరమ్మతులకు గతేడాది రూ.1,13,734 కోట్లు ఉండగా ఈసారి 2021–22 ఆర్థిక సంవత్సరానికి 18 శాతం పెంపుతో రూ.1,35,060 కోట్లు కేటాయింపులు చేశారు.

ఈ నిధులతో ముఖ్యంగా చలికాలంలో లద్దాఖ్‌లో50 వేల భద్రతా దళాలకు సౌకర్యాల మెరుగు చేయనున్నారు. అయితే ఈ బడ్జెట్ కేటాయింపులు పక్క దేశం చైనా కన్నా చాలా తక్కువ. చైనా బడ్జెట్ పరిశీలిస్తే 2014–19 కాలంలో 261.11 బిలియన్ డాలర్లు కేటాయించింది. భారత్ కేవలం 71.1 బిలియన్ డాలర్లు కేటాయించడం గమనార్హం. ఇక మన దాయాది దేశం 10.3 బిలియన్ డాలర్లు కేటాయించింది. ప్రతి సంవత్సరం రక్షణ రంగానికి బడ్జెట్ కేటాయింపులు భారత్ పెంచేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఈసారి బడ్జెట్‌లో రక్షణకు అత్యధిక కేటాయింపులు జరిగాయి.

# ఆరోగ్య సంరక్షణకు భారీగా నిధులు

**లాభాలతో కళకళలాడిన దలాల్ స్ట్రీట్**

ముంబై,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కేంద్ర బడ్జెట్‌లో ఆర్థికమమంత్రి నిర్మల సీతారామన్ ఆరోగ్య సంరక్షణకోసం భారీ నిధులతో పథకాన్ని ప్రకటించిన నేపథ్యంలో సోమవారం దలాల్ స్ట్రీట్ లాభాలతో కళకళలాడింది. హెల్త్‌కేర్ వ్యయానికి నిధుల రెట్టింపు, బీమా మార్కెట్లో విదేశీ పెట్టుబడులపై పరిమితులను ఎత్తివేసే ప్రణాళికలను రూపొందించడంతో బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు సోమవారం 5శాతానికి పైగా ఎగిసాయి. ఆరంభం నుంచీ లాభాలతో ఉన్న మార్కెట్లో బడ్జెట్ ప్రసంగం మొదలు, ముగిసేదాకా తమ జోష్‌ను కంటిన్యూ చేశాయి. సెన్సెక్స్ 2315 పాయింట్లు జంప్ చేయగా, నిఫ్టీ 14250కి ఎగువన ముగిసింది. అన్ని రంగాల షేర్లు లాభపడ్డాయి. ముఖ్యంగా బాంకింగ్, ఫైనాన్షియల్ షేర్ల లాభాలతో బ్యాంక్ నిఫ్టీ ఆల్ టైం గరిష్టాన్ని తాకింది. ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎస్‌బిఐ, బజాజ్ ఫిన్ సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా నిఫ్టీ టాప్ గెయినర్లుగా నిలిచాయి. ఆస్తి పునర్నిర్మాణ సంస్థ ఏర్పాటు, వాయు కాలుష్యాన్ని ఎదుర్కొనే చర్యలు, ప్రభుత్వరంగ బ్యాంకుల విభజన, బీమారంగంలో ఎఫ్‌డిఐ పరిమితిని 74 శాతానికి పెంచడం, డిజిటల్ చెల్లింపుల ప్రమోషన్ వంటి ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక సానుకూల ప్రభావాన్ని చూపే కొన్ని చర్యలు ఇన్వెస్టర్లను ప్రభావితం చేసాయని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. అలాగే కోవిడ్ సెస్, క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ వడ్డింపు భయాలు ఉన్నాయని, కానీ వీటిలో ఏదీ బడ్జెట్ 2021 లో కార్యరూపం దాల్చకపోవడం కూడా ఒక కారణమని పేర్కొన్నారు.

# బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం

**ప్రత్యేక హోదా ప్రస్తావనే లేదు**
**పోలవరం తదితర ప్రాజెక్టుల కేటాయంపుల ఊసే లేదు**
**కేవలం ఎన్నికల రాష్ట్రాల బడ్జెట్లా ఉంది: విజయసాయి**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ చాలా నిరాశాజనకంగా ఉందని, ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బడ్జెట్‌పూర్తిగా నిరాశపరిచిందని, ఏపీపై సవతి తల్లి ప్రేమ చూపించారని విమర్శించారు. ఏ రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నాయో ఆ రాష్ట్రాలకే ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగిపోయిందని, నిరుద్యోగ నిర్మూలన దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాల బడ్జెట్‌లా ఉందని, వారికే వరాలు కురిపించారని విజయసాయిరెడ్డి మండిపడ్డారు. ఏపీకి ఏమాత్రం నిధులు కేటాయించలేదని, ఆత్మనిర్భర్ కూడా కనపడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా విషయంలో కేంద్ర ప్రభుత్వ శ్రద్ధ ఏమాత్రం కనిపించలేదని విమర్శించారు. ఏపీలో మెట్రో రైలు కోసం కేంద్రాన్ని ఆరేళ్లుగా కోరుతున్నామని తమ విజ్ఞప్తుల్ని ఏమాత్రం పట్టించుకోలేదని అసంతృప్తి చెందారు. కొత్త టెక్స్‌టైల్ పార్క్ కావాలని కోరామని దానికి సంబంధించి బడ్జెట్‌లో ఏమాత్రం కేటాయింపులు లేవన్నారు.

మొత్తంగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం మొండి చేయి చూపించిందని విజయసాయిరెడ్డి అన్నారు. పోలవరం సవరించిన అంచనాలపై మాట్లాడలేదని, ÷–రెల్వ÷వేట్ కారిడార్ వల్ల పెద్దగా ఉపయోగం లేదని పేర్కొన్నారు. ఎక్కువ కిసాన్ రైళ్లను వేయాలని తాము కోరగా దాన్ని కేంద్రం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. నేషనల్ వైరాలజీ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని, రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రతి జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు

# బడ్జెట్‌కు ఊతంగా ఆరు మూలస్తంభాలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వార్షిక బడ్జెట్‌లో ఆరు మూలస్తంబాలను ప్రస్తావించారు. వీటి ఆధారంగా బడ్జెట్ ఉందన్నారు. ఆరోగ్యం, సంరక్షణ. ,ఫిజికల్, ఫైనాన్షియల్ క్యాపిటల్ అండ్ ఇన్‌ఫ్రా.,.సమ్మిళిత వృద్ధి. .హ్యూమన్ క్యాపిటల్.,ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్.,కనిష్ఠ ప్రభుత్వం–గరిష్ఠ పాలన ఈ ఆరింటిని మూలస్తంభాలుగా ఆమె పేర్కొన్నారు. బడ్జెట్‌పై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ.. ఈ ఆరు పిల్లర్లలో ఆరోగ్యరంగం అతి ప్రధానమమైనదన్నారు. ఆరోగ్యరంగంలో పెట్టుబడులు 137 శాతం పెరిగినట్లు తెలిపారు. గతేడాదితో పోల్చితే ఈసారి బడ్జెట్‌లో ఆరోగ్యరంగంపై 2.47 రెట్లు కేటాయింపులు పెరిగినట్లు వెల్లడించారు. ఇది దానికదే విజయంగా ఆయన అభివర్ణించారు. కాగా దీనిపై కాంగ్రెస్ నేత, పొలిటికల్ ఎకనామిస్ట్ ప్రవీణ్ చక్రవర్తి స్పందిస్తూ.. గతేడాది బడ్జెట్‌లో ఆరోగ్యరంగానికి రూ.67 వేల కోట్లు కేటాయించగా వాస్తవంగా ఖర్చు అయినది రూ. 82 వేల కోట్లుగా ఉందన్నారు. ఈసారి కేంద్రం రానున్న ఏడాదికి బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి 73,932 కోట్లు కేటాయించింది. బడ్జెట్ ప్రవేశం సందర్భంగా ఆర్థికశాఖ మంత్రి మాట్లాడుతూ.. ఆరోగ్య రంగానికి భారీగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. కాగా గతేడాది వాస్తవ ఖర్చులతో పోల్చితే ఈ ఏడాది హెల్త్ బడ్జెట్ కేటాయింపు తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యరంగానికి బడ్జెట్ పెరిగినట్లా? లేదా తగ్గినట్లా? అని ఆయన ప్రశ్నించారు. ఇదేవిధంగా బడ్జెట్ 2022 మొత్తం థీమ్ ఉందని ఆయన పేర్కొన్నారు.

ప్రగతిశీల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు, ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలుపుతున్నానని యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ పేర్కొన్నారు. పేదలు, రైతులు, యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రయోజనాలను కాపాడేలా బడ్జెట్ –2021 రూపొందించారని అన్నారు. మౌలిక రంగానికి బడ్జెట్‌లో చేపట్టిన భారీ కేటాయింపులతో పాటు ఈ రంగానికి కీలక ప్రాధాన్యత ఇవ్వడం ప్రశంసనీయమని వ్యాఖ్యానించారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అద్భుతంగా ఉందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్వాగతించారు. గతంలో ప్రభుత్వం ఐదు మినీ బడ్జెట్లు ప్రవేశపెట్టడంతో ప్రజలు ఈ తరహా బడ్జెట్‌ను ఆశించలేదని బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రయోజనాలకూ ప్రాధాన్యత ఇచ్చారని ప్రశంసించారు.

# పిఎఫ్‌పై వడ్డీతో బాదారు

**బడ్జెట్ తీరుతో కార్మిక రంగంపై తీవ్ర ప్రభావం**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): గత దశాబ్ద కాలంలో ప్రత్యక్ష పన్నుల్లో మార్పులు చేయలేదని కార్పొరేట్ రంగం నుంచి, అత్యున్నత సంపాదన పరులు, సంపన్నుల అభినందనలు అందుకుంటున్న విత్తమంత్రి నిర్మలా సీతారామన్.. వేతన జీవిపై మాత్రం కరుణ చూపలేదు. వివిధ రంగాల్లో ఉద్యోగుల రూ.2.5 లక్షల ప్రావిడెంట్ ఫండ్ కంట్రిబ్యూషన్‌పై వడ్డీరేటు మీద పన్ను వడ్డించారు. అందులోనూ ఉద్యోగి కంట్రిబ్యూషన్ మీదే పన్ను వడ్డన ఉంటుంది. పన్ను మినహాయింపు కోసం స్వచ్ఛంద ప్రావిడెండ్ ఫండ్‌లో చేరే అధిక వేతన ఉద్యోగులపై భారం పడనున్నది. అంతేకాదు.. ప్రతియేటా ఆదాయం పన్ను నుంచి మినహాయింపు కోసం ఉద్యోగులు.. యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పాలసీ (యూ లిప్స్) రూ.2.5 లక్షలు దాటితే ఆదాయం పన్ను చట్టం 10 (10డీ) సెక్షన్ కింద మినహాయింపు తొలగించివేశారు. అయితే పీఎఫ్ మీద పన్ను ప్రతిపాదించడం కేంద్ర ప్రభుత్వానికి ఇది కొత్త కాదు. 2016లోనూ ఈపీఎఫ్ మీద వచ్చే వడ్డీ 60 శాతం ఉంటే పన్ను వసూలు చేస్తామని ప్రతిపాదించారు అప్పటి విత్త మంత్రి. అయితే, ఉద్యోగ వర్గాల నుంచి సామూహిక నిరసన వెల్లువెత్తడంతో ప్రభుత్వం వెనక్కు తగ్గింది. అయితే, ఈ దఫా పీఎఫ్ మీద వడ్డీపై పన్ను వడ్డన ఉద్యోగులపై పెద్దగా ప్రభావం చూపక పోవచ్చునని ఆర్థికవేత్తలు అభిప్రాయ పడుతున్నారు. కేవలం క్రిమీ లేయర్ శాలరీడ్ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. ఉదాహరణకు నెలకు రూ.20,833 పీఎఫ్ కాంట్రిబ్యూషన్ చేస్తే వడ్డీపై పన్ను ప్రతిపాదన అమలవుతుంది. అంటే నెలవారీ వేతనం రూ..1.73 లక్షలు ఉన్న ఉన్నతోద్యోగులకు అన్నమాట. అయితే, ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నూతన వేజ్ కోడ్ అమలులోకి రానున్నది. అదే జరిగితే ఆటోమేటిక్‌గా ఉద్యోగుల పీఎఫ్ కంట్రిబ్యూషన్ పెరిగిపోతుంది.

# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

**రైతులకు కనీస మద్దతు ధరలను మరిచారు**
**రైతుల ఆదాయం రెండింతలు చేస్తామన్న నినాదం బూటకం**
**హైదరాబాద్ మెట్రోను పూర్తిగా విస్మరించారు**
**బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఊసేది**
**బడ్జెట్ కేటాయింపులపై మండిపడ్డ ఉత్తమ్,భట్టి, పొన్నాల**

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి1 (ఆర్ఎన్ఎ):కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. రైతులకు భరోసా అని చెప్పి కనీస మద్దతు ధరల విషయాన్ని ప్రస్తావించలేదన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ బడ్జెట్‌తో తెలంగాణకు ఒరిగేదేమీ లేదన్నారు. ఆయుష్మాన్ భారత్ కింద ఇచ్చిన 10 వేల కోట్లు 29 రాష్ట్రాలకు ఏ మాత్రం సరిపోవన్నారు. పెట్రోల్, డీజిల్‌పై సెస్ విధించడం దారుణమన్నారు. రైతుల ఆదాయం రెండింతలు చేస్తామన్న నినాదం పచ్చి అబద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. మెట్రో రైలు విస్తరణలో హైదరాబాద్‌కు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్షల కోట్ల ప్రజల ఆస్తులను అమ్మేసే ప్రణాళిక రచించడం దారుణమన్నారు. హైదరాబాద్–విజయవాడ బుల్లెట్ ట్రైన్ కేటాయించాలన్నారు.కరోనా పేరుతో ఎంపీల నిధులు కట్ చేశారని, సెంట్రల్ విస్టాకు నిధులు ఎలా ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఎంపీ ల్యాడ్స్ వెంటనే పునరుద్ధరించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు కేంద్ర బడ్జెట్ తీవ్రంగా నిరాశ పర్చిందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. బడ్జెట్‌పై ఆయన స్పందించారు. తెలంగాణ గురించి బడ్జెట్‌లో ఒక్క మాట మాట్లాడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రై పోర్ట్ గురించి ప్రస్తావనే లేదన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ గురించి ఎక్కడా చెప్పలేదని పేర్కొన్నారు. ఇంత అన్యాయం జరుగుతుంటే టీఆర్ఎస్, బీజేపీ ఎంపీలు గాడిదలు కాస్తున్నారా? బీజేపీ, టీఆర్ఎస్‌లకు ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సామాన్యుల ఆత్మగౌరవాన్ని బీజేపీ పెట్టుబడిదారులకు తాకట్టు పెడుతోందని ఆరోపించారు. ఇలాంటి బడ్జెట్‌ను తానెప్పుడూ చూడలేదని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

ఒక తెలుగు మహిళా బడ్జెట్ ప్రవేశ పెట్టినా తెలుగు రాష్ట్రాలకు ఎటువంటి లాభం లేదని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పొన్నాల మీడియాతో మాట్లాడుతూ 'ఉపాధి రంగాన్ని కాపాడటానికి ఎక్కడా బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు చాలా ఎక్కువగా పెరిగాయి. పేదింటి బడ్జెట్ అన్నారు. పేదింటి రాయితీలు ఎక్కడా లేవు. దేశంలోనే హైదరాబాద్ మెట్రో చాలా పెద్దది అన్నారు.

# పారిశ్రామిక వేత్తలకు పెద్దపీట వేసిన బడ్జెట్: సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కేంద్ర బడ్జెట్ కేవలం పారిశ్రామికవేత్తల ప్రయోజనాలకు పెద్దపీట వేసిందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని బడా పారిశ్రామికవేత్తల కోసమే ముందుకుతెచ్చారని పెదవివిరిచారు. లాభాలను దండుకోవాలని కోరుకునే వారికే బడ్జెట్ ఊతమిచ్చేలా ఉందని ఆరోపించారు. స్వయం సమృద్ధి పేరుతో జాతి సంపదను ప్రభుత్వం తెగనమ్ముతోందని దుయ్యబట్టారు. రక్షణ, ఇంధన, ఎయిర్‌పోర్ట్స్, రైల్వేల వంటి కీలక రంగాలు సహా అన్నింటినీ ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతోందని వ్యాఖ్యానించారు.

మరోవైపు ఇది కార్పొరేట్ బడ్జెట్, ఎన్నికల బడ్జెట్, ప్రజా వ్యతిరేక అంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ప్రజల చేతుల్లో డబ్బులుంచాలన్న నిపుణుల సూచనలను కేంద్రం అసలు పట్టించుకోలేని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రజల చేతుల్లో నగదు పెట్టడం మర్చిపోయిన మోడీ ప్రభుత్వం భారత ఆస్తులను క్రోనీ కాపిటలిస్టులకు కట్టబెడుతోందని ఆయన ట్వీట్ చేశారు.

# వైద్య రంగానికి పెరిగిన కేటాయింపులు

**స్వాగతించిన సీరం సంస్థ చీఫ్ ఆధర్ పూనావాలా**

పుణె,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కేంద్ర బడ్జెట్‌ను సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ..సీరం సంస్థ సీఈవో ఆధర్ పూనావాలా స్వాగతించారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా స్వస్థ్ భారత్ పథకాన్ని ప్రకటించింది. మంత్రి నిర్మలా సీతారామన్ ఆ స్కీమ్‌కు సంబంధించిన వివరాలనుబడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. సుమారు 64 వేల కోట్లతో స్వస్థ్ స్కీమ్‌ను ప్రవేశపెట్టనున్నారు. దీన్ని ఆధార్ పూనావాలా ఆహ్వానించారు. హెల్త్‌కేర్, వ్యాక్సిన్ రంగాలకు కేంద్రం బడ్జెట్ కేటాయించిన తీరు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఏ దేశానికైనా ఇదే అత్యుత్తమ పెట్టుబడి అని ఆయన అన్నారు. భారత్ ఎంత ఆరోగ్యంగా ఉంటే, దేశం అంత ఉత్పాదన చేస్తుందని ఆయన అన్నారు. వైద్యరంగానికి కేటాయంపులు పెంచడాన్ని ఆయన స్వాగతించారు.

# పూర్తిగా నిరాశ పరిచిన బడ్జెట్

**ఎంపిక కేటాయింపులు సున్నా**
**కేవలం ఎన్నికలు జరిగే రాష్ట్రాలకే ప్రాధాన్యం: తులసిరెడ్డి**

కర్నూలు,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ బడ్జెట్ గురించి చెప్పాలంటే అప్పుల బడ్జెట్, కేవలం నాలుగు రాష్ట్రాలకు సంబంధించిన బడ్జెట్ అని చెప్పారు. ఇకా చెప్పాలంటే ఎపికి వ్యతిరేకంగా సాగిన బడ్జెట్ అన్నారు. ఈబడ్జెట్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏపీకి తీరని అన్యాయం చేశాడన్నారు. మోదీ ప్రధాని కాకముందు, ఉన్న అప్పు 50లక్షల కోట్ల రూపాయలు, ప్రధాని అయిన తర్వాత 102 లక్షలు కోట్లు రూపాయలు అప్పు ఉందన్నారు. ఇది చాలదనట్టు 2021–2022 ఆర్థిక సంవత్సరంలో 12 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేస్తామని నిర్మల సీతారామన్ గర్వంగా చెబుతున్నారని ఎద్దేవా చేశారు. మోదీ హయాంలో దేశం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుందని చెప్పారు.

ఎన్నికలు జరగబోతున్న తమిళనాడు, కేరళ, వెస్ట్ బెంగాల్, అస్సాం రాష్ట్రాలకు సంబంధించిన బడ్జెట్ల ఉందని ఎద్దేవా చేశారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com